



మంత్రులతో కలిసి శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి

ప్రజల గొంతుక ప్రజాశక్తి

- ప్రజాస్వామ్యానికి మార్గదర్శి - ప్రజాశక్తి ఎడిషన్ 20వ వార్షికోత్సవంలో వక్తలు



ప్రజాశక్తి వార్షికోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్



వేడుకల్లో మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బిటి.నాయుడు

వేడుకల్లో మాట్లాడుతున్న డాక్టర్ శంకర్ శర్మ



ప్రజాశక్తి - కర్నూలు క్రైం

ప్రజల గొంతుక ప్రజాశక్తి అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ తెలిపారు. ప్రజాశక్తి కర్నూలు ఎడిషన్ 20వ వార్షికోత్సవ వేడుకలను గురువారం ఎడిషన్ కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యాలయానికి స్థలం ఇచ్చిన నగరూరు సుబ్రహ్మణ్యం దాతృత్వ కీర్తి ప్రజాశక్తితో పాటు చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. వారి కుటుంబం ప్రజాశక్తితోనే ఉండడం అభినందనీయమని తెలిపారు. విలువలతో, నిబద్ధతతో సిబ్బంది పని చేయడమే ప్రజాశక్తి విజయ రహస్యమని చెప్పారు. అనంతరం టిడిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బిటి.నాయుడు మాట్లాడారు. నేడు ప్రజాస్వామ్యం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. దేశంలో మనీ, మాఫియా, మీడియా రాజ్యమేలుతోందని తెలిపారు. ప్రజల కోసమే పని చేసే మీడియాగా ప్రజాశక్తి వ్యవహరిస్తోందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి మాట్లాడుతూ... ప్రతిక్షణం వార్తలను వండివార్చే మీడియా ఉన్న స్థితిలో పోటీని తట్టుకుని ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా ప్రజాశక్తి పని చేయడం అభినందనీయమని తెలిపారు. దీనికి సిబ్బంది అంకితభావమే కారణమన్నారు. ఉద్యమాలకు అండగా నిలిచే పత్రిక ప్రజాశక్తి అన్నారు. ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ... ప్రజాశక్తి అన్ని అంశాలను క్రోడీకరించి వార్తలను అందిస్తోందన్నారు. సామాన్యుల ఊపిరిగా ప్రజాశక్తి నిలుస్తోందన్నారు. ప్రజాశక్తిని చేర్పించడం, చదవడం, చదివించడం సామాజిక బాధ్యతే అన్నారు. రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య మాట్లాడుతూ... సోషల్ మీడియా ప్రభావం బలంగా ఉన్న నేటి పరిస్థితుల్లో పోటీని తట్టుకుని నిలబడడం ప్రజాశక్తికి ఉన్న ప్రత్యేకత అన్నారు. నేడు పార్టీల పరంగా పత్రికలు విడిపోయాయని, కానీ ప్రజల పక్షాన నిలబడి నికరమైన వార్తలను రాసేది ప్రజాశక్తి అని తెలిపారు. నగరూరు సుబ్రహ్మణ్యం ట్రస్టు ఛైర్మన్, కర్నూలు మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ నగరూరు శమంతకమణి మాట్లాడుతూ... ప్రజాశక్తితో తమ కుటుంబం ఎంతో అనుబంధాన్ని కలిగి ఉందన్నారు. ప్రజాశక్తి వైభవానికి కార్మికుల ఐక్యత, కుటుంబ వాతావరణమే కారణమన్నారు. ప్రజాశక్తికి తాము అండగా ఉంటామని అన్నారు. ప్రజాశక్తి జనరల్ మేనేజర్ హరికిషోర్ మాట్లాడుతూ... బ్రిటీష్ విధానాలకు వ్యతిరేకంగా పని చేసిన చరిత్ర కలిగిన పత్రిక ప్రజాశక్తి అన్నారు. మొదట్లో కొన్ని ఒడిదుడుకులతో అంతరాయం ఏర్పడినా 1981 నుంచి ప్రతి అక్షరం ప్రజల పక్షం నినాదంతో పని చేస్తోందన్నారు. 43 ఏళ్లుగా నిరాటంకంగా పని చేసిందన్నారు. ఉద్యోగుల పిఆర్‌సి ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలుస్తూ ప్రభుత్వంతో రాజీలేకుండా నిలబడిందన్నారు. అనంతరం ఎడిషన్ ఏర్పడినప్పటి నుంచి ఉన్న సిబ్బందిని, విలేకరులను సన్మానించారు. సన్మానం అందుకున్న వారిలో డెస్క్ ఇన్‌ఛార్జీ పానుగంటి చంద్రయ్య, ఎడివిటి జిల్లా ఇన్‌ఛార్జీ ఎం.రాజు, సిబ్బంది మల్లికార్జున, రంగయ్య, జయలక్ష్మి, భీసన్న, మద్దిలేటి, మునిస్వామి, జగదీష్ గౌడ్, విలేకరులు జోసఫ్ శేఖర్, మాదాల శ్రీనివాసులు, నాగయ్య, షుకూర్, యూసుఫ్ ఖాన్, ఇంతియాజ్ బాషా, సోమశేఖర్, కేశవులు, నాగరాజు, సర్క్యులేషన్ ఏజెంట్ ఈరన్న ఉన్నారు. మున్సిపల్ స్టాండింగ్ కమిటీ సభ్యులు నగరూరు శ్రీనివాసరావు, బిల్డర్ నగరూరు రాఘవేంద్ర, టిఎన్‌టియుసి రాష్ట్ర నాయకులు అశోక్, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ టి.నరసింహా, అనంతపురం ఎడిషన్ మేనేజర్ ఎన్.వేణుగోపాల్, ఎడిషన్ కమిటీ సభ్యులు మంగయ్య, ఎస్ఎడి.బాషా, ఎల్లా గువేరా, వినయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గౌస్‌దేశాయి



మాట్లాడుతున్న హరికిశోర్



మాట్లాడుతున్న శమంతకమణి



మాట్లాడుతున్న పుల్లయ్య



మాట్లాడుతున్న శ్రీనివాసరావు



మాట్లాడుతున్న రాఘవేంద్ర

అవుకు రెండో టన్నెల్

జాతికి అంకితం

- ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

- రిజర్వాయర్‌లోకి 20 వేల క్యూసెక్కుల నీటి విడుదల

ప్రజాశక్తి - బనగానపల్లి/అవుకు

అవుకు మండలంలోని మెట్టుపల్లె గ్రామ పరిసరాల్లో ఉన్న అవుకు రెండో టన్నెల్‌ను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గురువారం జాతికి అంకితం చేశారు. తొలుత గన్నవరం విమానాశ్రయం నుంచి ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి అక్కడి నుంచి హెలీక్యాప్టర్ ద్వారా అవుకు సమీపంలోని హెలీప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి అవుకు రెండో టన్నెల్ వద్దకు చేరుకుని పైలాన్‌ను ఆవిష్కరించారు. గోరకల్లు రిజర్వాయర్ నుంచి అదనంగా 10 వేల క్యూసెక్కులతో కలిపి మొత్తం 20 వేల క్యూసెక్కుల నీటిని అవుకు రిజర్వాయర్‌కు విడుదల చేశారు. రెండో సొరంగం పనుల ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హెలీప్యాడ్ వద్దకు చేరుకుని కడప విమానాశ్రయానికి బయల్దేరి వెళ్లారు. రెండు టన్నెళ్ల ద్వారా 20 వేల క్యూసెక్కుల నీటిని అవుకు రిజర్వాయరుకు తరలించి అక్కడి నుంచి గాలేరు నగరి వరద కాలువ ద్వారా కడప, చిత్తూరు జిల్లాలకు తరలించనున్నారు. ఆ జిల్లాలో 2.60 లక్షల ఎకరాలకు సాగునీరు, 1.31 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, 640 గ్రామాల్లోని 20 లక్షల మందికి తాగునీటిని అందించనున్నారు. జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి ఎస్‌బి.అంజాద్ బాషా, కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్, జలవనరుల ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర రెడ్డి, మైనారిటీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు హాబీబుల్లా, ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషన్ కుమార్, ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా, బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, తొగూర్ ఆర్థర్, బ్రిజేంద్రనాథ్ రెడ్డి, శిల్పా చక్రపాణి రెడ్డి, మార్క్ ఫెడ్ ఛైర్మన్ పిపి.నాగిరెడ్డి, నంద్యాల జిల్లా వ్యవసాయ మండలి ఛైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి, కెడిసిసి బ్యాంక్ ఛైర్మన్ విజయ మనోహరి, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేయడంతో ఎక్కడ చూసినా పోలీసు బలగాలు కనిపించాయి.

సిఎంకు ఘన స్వాగతం, వీడ్కోలు

ముఖ్యమంత్రి నంద్యాల జిల్లా పర్యటనలో భాగంగా ఓర్వకల్లు విమానాశ్రయం, అవుకు హెలీప్యాడ్ వద్ద సిఎంకు ఘన స్వాగతం లభించింది. ఓర్వకల్లు విమానాశ్రయంలో కర్నూలు ఎంపీ సంజీవ్ కుమార్, కలెక్టర్ జి.సృజన, డిఐజి సెంథిల్ కుమార్, ఎస్పీ జి.కృష్ణ కాంత్, జెసి నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎర్రకోట చెన్న కేశవ రెడ్డి, హఫీజ్ ఖాన్, జె.సుధాకర్, శిల్పా చక్రపాణి రెడ్డి, తోగూరు ఆర్థర్, కంగాటి శ్రీదేవి, కర్నూలు నగర మేయర్ బివై.రామయ్య, కుడా ఛైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీ బుట్టా రేణుక, ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ విద్యా సాగర్, నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, ప్రదీప్ కుమార్ రెడ్డి స్వాగతం పలికారు. అవుకు హెలీప్యాడ్ వద్ద మంత్రులు అంబటి రాంబాబు, ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, శిల్పా చక్రపాణి రెడ్డి, కలెక్టర్ మనజీర్ జిల్లాని సామూన్, ఎస్పీ రఘువీర్ రెడ్డి పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు. సిఎం పర్యటన ముగిసిన అనంతరం అవుకు హెలీప్యాడ్ వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు ముఖ్యమంత్రికి వీడ్కోలు పలికారు.

45 రోజుల్లో 15,891 గృహాలు నిర్మించాలి

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్



జిల్లాలో రానున్న 45 రోజుల్లోపు 15,891 గృహాలను నిర్మించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో పలు అంశాలపై సమీక్షించారు. రీ సర్వేకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల పనులను నిర్దేశించిన గడువులోపు పూర్తి చేసి ఎట్టి పరిస్థితుల్లోనూ ఈనెల 15 నాటికి ఫైనల్ ఆర్ఒఆర్ పబ్లిష్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 'ఆడుదాం ఆంధ్ర'కు సంబంధించి అన్ని సచివాలయాల్లో వంద శాతం రిజిస్ట్రేషన్ మొదలు కావాలని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి 45, 30 రోజులకు పైబడి పెండింగ్‌లో ఉన్న ఫారాలను డిస్పోస్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చిన ఫారాలను 12 గంటల్లోపు ప్రాసెస్ చేయాలని చెప్పినప్పటికీ ఇంకా 4 వేలు పెండింగ్‌లో ఉన్నాయని, త్వరగా డిస్పోస్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ం



ఎమ్మెల్యేకు సమస్యలు విన్నవిస్తున్న మహిళలు

రాష్ట్రంలో అవినీతి రహిత పాలన : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో అవినీతి రహిత పాలన కొనసాగుతోందని కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఎ.హాఫీజ్ ఖాన్ అన్నారు. గురువారం నగరంలోని 24వ వార్డ్ 62వ సచివాలయం పరిధిలో కెసి కెనాల్, లక్ష్మీనగర్ వీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల గురించి ఎమ్మెల్యే ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వీధిలో డ్రైనేజీ, మురికి కాలువల సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే సనుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అమలు చేస్తున్నారని తెలిపారు. రాజకీయాలకతీతంగా బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం వైసిపి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ అసిఫ్, డిష్ రాజు, సునీల్, సుచరిత, అర్చన్, అబ్బాస్ అలీ, అనీస్ ఖాన్, కల్పనా, మధు, ముఖ్య నాయకులు గడ్డం రామకృష్ణ, క్లస్టర్-2 ప్రెసిడెంట్ కేదార్ నాథ్, నజీర్ అలీ ఖాన్, సోహైల్ బాబా, జాఫర్, అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

9 లోపు ఓటు నమోదు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - సి బెళగల్

మండలంలో ఈ నెల 9లోపు ఓటు దరఖాస్తు నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని తహసీల్దార్ శేషఫణి బిఎల్ఒలను ఆదేశించారు. గురువారం ఎంపిడిఒ శ్రీనివాసులు అధ్యక్షతన ఓటు దరఖాస్తు నమోదు ప్రక్రియపై తహశీల్దార సమీక్షించి మాట్లాడారు. ఈ నెల 2, 3 తేదీలలో పోలింగ్ కేంద్రాలలో దరఖాస్తులు స్వీకరించాలని, ఆ తర్వాత గడప గడప తిరిగి వయోజనులకు అవగాహన కల్పించి నమోదు పూర్తి చేయాలన్నారు.

జనవరి నుండి రెండో విడత సురక్ష క్యాంపులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్ : జనవరి నుండి రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన గురువారం జిల్లా కలెక్టర్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి తుగ్గలి

రైతుల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిరంతరం పాటుపడుతున్నారని పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి అన్నారు. గురువారం తుగ్గలిలోని జూనియర్ కళాశాలలో క్రిష్ణగిరి, వెల్దుర్తి, తుగ్గలి, మద్దికెర, పత్తికొండ మండలాల్లో ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న నిరుపేద రైతులకు భూ హక్కు పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాడు స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి రైతుల అభివృద్ధి కోసం భూములను పంపిణీ చేశారన్నారు. ప్రస్తుతం జగనన్న కూడా పేదలకు పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేస్తున్నారని చెప్పారు. గతంలో ఎస్సీ కార్పొరేషన్ కింద కొనుగోలు చేసిన భూములు, అలాగే ప్రభుత్వం పంపిణీ చేసిన భూములపై కూడా సర్వహకులు కల్పించినట్లు చెప్పారు. రైతుల అభివద్ధి కోసం ఉచిత పంట ఇన్సూరెన్సు, 0 వడ్డీ రుణాలు, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా పత్తికొండ ప్రాంతంలో రైతుల అభివృద్ధి కోసం రూ.12 కోట్లతో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, ఆర్డిఓ రామ్ లక్ష్మి, తహాశీల్దార్లు సల్కాపురం రవి, విష్ణు ప్రసాద్, నాగభూషణం, సర్పంచి రవికుమార్, వైఎస్ఆర్సిపి నాయకులు మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, అట్లా గోపాల్ రెడ్డి, నగేష్ యాదవ్, నాభూషణ్ రెడ్డి, సర్పంచులు రవి, మనేంద్ర, డిప్యూటీ తహశీల్దార్ నిజాముద్దీన్, ఆర్ఐ సుధాకర్ రెడ్డి, విఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.



భూ హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి

ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయండి

- రైతు సంఘం, సిఐటియు

ప్రజాశక్తి - వెల్దుర్తి

కర్నూలులో ఈ నెల 15, 16, 17 తేదీలలో జరుగుతున్న ఎఐకెఎస్ సమావేశాల్లో రైతు శ్రేయోభిలాషులు, రైతులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా నాయకులు నగేష్, నాయకులు మాధవ కృష్ణ, సిఐటియు మండల అధ్యక్షులు రాజు కోరారు. గురువారం వెల్దుర్తిలోని సిఐటియు మోటార్ వర్కర్స్ యూనియన్ ఆఫీస్‌లో ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలను నడిపిన చరిత్ర కలిగిన ఏఐకేఎస్ నాయకులు కర్నూలుకి రావడం, ఆ సమావేశాలు కర్నూల్‌లో నిర్వహించడం వల్ల అత్యంత కరువుతో అలమటిస్తున్న కర్నూలు జిల్లా కరువు కూరల్లో చిక్కుకుపోవడానికి కారణాలను దేశవ్యాప్తంగా తెలియజేసే అవకాశం వచ్చిందని తెలిపారు. ఈ సంవత్సరం కర్నూలు జిల్లా మొత్తం కరువులో కూరుకుపోయిందని అన్నారు. దశాబ్దాల తరబడి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాలో రైతులందరికీ సాగు నీరు అందించడానికి అవకాశం ఉన్న ప్రాజెక్టులపై దృష్టి పెట్టకపోవడంతో ఈ పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. తక్షణం కరువు సహాయక చర్యలను చేపట్టి రైతులను, కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాముడు, మహేష్, మళ్ళీ, పెద్ద ఏసు, వెంకటరాముడు, శీను తదితరులు పాల్గొన్నారు.



గోడ పత్రికలను విడుదల చేస్తున్న నాయకులు

నగరంలో అశాస్త్రీయంగా అభివృద్ధి పనులు

- ఇంజనీర్లు, కాంట్రాక్టర్లపై చర్య తీసుకోవాలి


- పట్టణ పౌర సంక్షేమ సంఘం డిమాండ్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగర పాలక సంస్థ ఇంజనీర్లు ఆశాస్త్రీయంగా అభివృద్ధి పనులు ప్రారంభించి వారాల తరబడి నత్త నడకన కొనసాగిస్తున్నారని మున్సిపల్ మాజీ కార్పొరేటర్, పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నగరంలోని కొన్ని ప్రాంతాల్లో అవసరం లేని అభివృద్ధి పనులు చేపట్టి, రోడ్లను తవ్వి ప్రజలను ప్రమాదాలకు గురి చేస్తున్నారని చెప్పారు. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఓల్డ్ సిటీ, అశోక నగర్‌లలో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. నగరంలో ప్రధాన రోడ్డు కొండారెడ్డి బురుజు ఎదుట గత 20 రోజుల నుండి బాగున్న తారు రోడ్డును తవ్వి సిమెంట్ బెడ్ కంకర వేసి దానిపై సిమెంటు ఇటుకలను ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. రోడ్డు పనులు ప్రారంభించేటప్పుడు ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కానీ ఒక వైపు పూర్తిగా తవ్వి వారాల తరబడి కాలయాపన చేయడం వల్ల రోజు ప్రమాదాలు జరుగుతున్నాయని, మూడు రోజుల క్రితం ఉదయం 9 గంటల సమయంలో పెద్ద మార్కెట్కు ప్రాంతానికి చెందిన యువకుడు ద్విచక్ర వాహనంపై వెళుతూ పెద్ద పోస్ట్ ఆఫీస్ ఏటిఎం ఎదుట ప్రమాదానికి గురై నడవలేని పరిస్థితుల్లో రోడ్డుపై పడి ఉంటే ఇతర ద్విచక్ర వాహనదారులు హాస్పిటల్‌కి తీసుకెళ్లారని తెలిపారు. ఇప్పటికైనా కమిషనర్, మేయర్ వెంటనే స్పందించి నగరంలో పర్యటించి అవసరంలేని అభివృద్ధి పనులు ప్రారంభించి కాలయాపన చేస్తూ ప్రజలను ప్రమాదాలకు గురి చేస్తున్న ఇంజనీర్లు, కాంట్రాక్టర్లపై చర్య తీసు కోవాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతిధులు, ఉన్నతాధికారులు ఇలాగే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వస్తుందని హెచ్చరించారు.



నత్తనడకన సాగుతున్న పనులు



భక్త కనకదాసుకు నివాళులర్పిస్తున్న మేయర్ రామయ్య, ఎమ్మెల్యే సుధాకర్, ఇతర సంఘాల నేతలు

ఘనంగా భక్త కనకదాసు జయంతి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

స్థానిక సి.క్యాంపులోని బీసీ సంక్షేమ భవన్‌లో భక్త కనకదాసు జయంతోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కర్నూలు పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సంజీవ్ కుమార్, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, కోడుమూరు శాసనసభ్యులు సుధాకర్, నగర మేయర్ బివై రామయ్య డిఆర్ఓ కే మధుసూదన్ రావు, బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటలక్ష్మి, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొని భక్త కనకదాసు విగ్రహానికి ఘన నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కనకదాసు చేసిన కీర్తనలు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ బత్తిని వెంకట రాముడు, ఆయా సంఘాల నేతలు నక్కమిట్టల శ్రీనివాసులు, తిరుమలేష్, రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

8 నుండి వికలాంగుల హక్కుల పోరుబాట యాత్ర

- జయప్రదం చేయండి : ఎంఆర్‌పిఎస్, విహెచ్‌పిఎస్

ప్రజాశక్తి - కోడుమూరు : వికలాంగుల హక్కులు, చట్టాలు, రాయితీ, రిజర్వేషన్ల సాధన కోసం ఈ నెల 8వ తేదీ నుండి 11వ తేదీ వరకు 100 కిలోమీటర్లు వికలాంగుల హక్కుల పోరుబాట యాత్రను చేపడుతున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు సుమాలి ఆంధ్రయ్య, విహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు బిసి నాగరాజు తెలిపారు. గురువారం కోడుమూరు మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించిన వికలాంగుల హక్కుల పోరుబాట యాత్ర ప్రచారంలో భాగంగా వారు విలేకరులతో మాట్లాడారు. వికలాంగులకు రూ.6 వేలు పెన్షన్ పెంచాలని, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, 4 శాతం పర్సెంట్ రిజర్వేషన్ అమలు చేయాలని, ఇంటి స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వికలాంగుల హక్కుల పోరుబాట యాత్రలో కోడుమూరు తాలుకాలోని బెలగల్, గూడూరు మండలంలోని అన్ని గ్రామాల వికలాంగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం పోరుబాట యాత్ర కరపత్రాలు, గోడపత్రికలను పంపిణీ చేశారు. అనంతరం వారు సిఐటియు మండల కార్యదర్శి నాయకులు జిపి వీరన్నను కలిసి ఈ కార్యక్రమానికి సంఘీభావం తెలపాలని కోరారు. ఆయన మాట్లాడుతూ తప్పకుండా ఈ కార్యక్రమానికి మద్దతు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో విహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిసి సోమన్న, టిడిపి విభిన్న ప్రతిభావంతుల సెల్ బి.సురేష్ నాయుడు, విద్యాసాగర్, భాస్కర్, రూబీనా, షబ్బీర్, షేక్షావలి, రాజశేఖర్, విహెచ్‌పిఎస్ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.పెద్దయ్య, సి.రంగన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



అసైన్డ్ భూములు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని గ్రామాల్లో భూమి లేని నిరుపేదలకు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అసైన్డ్ భూములకు సంబంధించిన పట్టాలను పంపిణీ చేశారు. గురువారం మండలంలోని ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలో 25 మంది లబ్ధిదారులకు 27 ఎకరాల భూమి పట్టాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చే విధంగా చర్యలు చేపట్టారని, పట్టా పొందిన లబ్ధిదారులు భూములను సాగులోకి తెచ్చేందుకు కృషి చేయాలని తెలిపారు. వైసిపి మండల ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, తహశీల్దార్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సంక్షేమానికి పెద్దపీట : శాంత

ప్రజాశక్తి - ఆదోని



ప్రజలతో మాట్లాడుతున్న నాయకులు

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేద, బడుగు, బలహీన వర్గాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని మున్సిపల్ ఛైర్పర్సన్ శాంత తెలిపారు. రాబోయే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని గెలిపించుకుని రాష్ట్రాభివృద్ధితో పాటు పేద కుటుంబాల అభివృద్ధికి సహాయ, సహకారాలు అందించాలని కోరారు. గురువారం ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు 17వ వార్డు కౌన్సిలర్ చిన్న అధ్యక్షతన 'ఏపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత, జెసిఎస్ టౌన్ కన్వీనర్ వెల్లాల మధుసూదనశర్మ ముఖ్య అతిథులుగా హాజరయి మాట్లాడారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే కాకుండా ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి ఇంటి పట్టాలు, టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి పంపిణీ కూడా దాదాపు పూర్తి చేశారని తెలిపారు. అనంతరం మున్సిపల్ తాత్కాలిక మేనేజర్ అస్లాం బాషా 17వ వార్డుకు సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధి వివరించి, సంక్షేమ పథక వివరాలతో కూడిన బోర్డును ఛైర్మన్ శాంత, కౌన్సిలర్లు చిన్న, చలపతి, మధుసూదనశర్మలతో కలిసి ఆవిష్కరించారు. వైసిపి నాయకులు యు.నరసింహులు, కొండయ్య, ఈరన్న, కన్న, బసప్ప పాల్గొన్నారు.

ముస్లింలను దగా చేసిన వైసిపి

- టిడిపి మాజీ ఇన్‌ఛార్జి గుడిసె ఆది కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని



నిర్మాణాన్ని పరిశీలిస్తున్న గుడిసె ఆది కృష్ణమ్మ

రాష్ట్రంలో ముస్లిం, మైనార్టీలకు నిధులు కేటాయించకుండా వైసిపి ప్రభుత్వం ముస్లింలను దగా చేస్తోందని టిడిపి మాజీ ఇన్‌ఛార్జి గుడిసె ఆది కృష్ణమ్మ విమర్శించారు. గురువారం ఆదోనిలోని విక్టోరియా పేటలో మహబూబ్ పార్కు వద్ద షాదీఖానా నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 2019లో టిడిపి హయాంలో ఎంపీ, సంక్షేమ శాఖ నిధులతో చేపట్టిన షాదీఖానా నేడు ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని తెలిపారు. షాదీఖానా కట్టిస్తామని ముస్లింలకు మాయమాటలు చెప్పి ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి మోసం చేస్తున్నారని విమర్శించారు. ముస్లిం, మైనార్టీలను అభివృద్ధి చేస్తామని గొప్పలు చెప్పుకోవడం తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. నియోజకవర్గంలోని ముస్లిం, మైనార్టీ నాయకులకు బేషరతుగా క్షమాపణ చెప్పి ముస్లిం, మైనార్టీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. పట్టణంలోని ముస్లింల అభివృద్ధికి కేటాయించిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ, పట్టణం ముస్లిం నాయకులు సాధిక్ వలీ, వసీమ్, ఖాదర్, సలీం, రసూల్ బాషా, రఘావరెడ్డి, ఈరన్న, వీరేష్, నాగేంద్ర పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండ ఎస్సీ కాలనీలో మూడు రోజుల క్రితం విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధమైన దళిత రామాంజనేయులుకు ఆర్థిక సహాయం అందజేశారు. గురువారం శ్రీబ్రహ్మం గారి సేవా సమితి గ్రూపు సభ్యులు బాధిత కుటుంబానికి రూ.13 వేల నగదు అందజేశారు. ఎం.నరసన్న బత్తిని సిద్ధప్ప, ముత్యాల మధుసూదన, రామి రెడ్డి, మహాదేవమ్మ, బత్తిని ఓంకార్, రామచంద్రయ్య, బళ్లారి ఓంకార్, రంగస్వామి, కిష్టన్న పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశం రసాభాస

- వైస్ ఛైర్మన్ నజీర్, టిడిపి ఫ్లోర్ లీడర్ దయాసాగర్ వాగ్వాదం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా సాగింది. సమావేశంలో టిడిపి, వైసిపి సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. గురువారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఛైర్మన్ డాక్టర్ రఘు అధ్యక్షతన జనరల్ కౌన్సిల్ సభ్యుల సమావేశం జరిగింది. ముందుగా సాధారణ, టేబుల్ అజెండా అంశాలను వైసిపి సభ్యులు ఆమోదించారు. వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ... కమిషనర్ గంగిరెడ్డి పట్టణ అభివృద్ధి కృషి చేస్తున్నారని, ఆయనపై కొందరు అనవసరంగా ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. కోనేరు నాగేంద్ర ప్రసాద్ సమాచార హక్కు చట్టం పేరుతో పిటిషన్లు పంపిస్తూ ఇబ్బందులు పెడుతున్నారని, ధైర్యం ఉంటే మున్సిపల్ కార్యాలయానికి వచ్చి ప్రజలకు ఉపయోగపడే పనులపై సమాచారం అడగాలని చెప్పారు. ఇంట్లో కూర్చొని సమాచార హక్కు కింద వివరాలు అడుగుతున్నారని, అతను బయటికి వస్తే ప్రజలు తన్నే అవకాశం ఉందని తెలిపారు. అలాగే వీవర్స్ కాలనీ గ్రౌండ్ సొసైటీకి చెందిందని, చేనేతల ఆస్తినా లేదా అంటూ టిడిపి కౌన్సిలర్ దయాసాగర్‌ను ప్రశ్నించారు. ఇది మున్సిపల్ స్థలం కాదన్నారు.

అనంతరం టిడిపి కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ విజిఎ.దయాసాగర్ మాట్లాడుతూ... వీవర్స్ కాలనీ గ్రౌండ్‌లో బంకులు తీసేయాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. కమిషనర్ గంగిరెడ్డి పట్టించుకోవడం లేదన్నారు. మిలటరీ కాలనీలో 80 అడుగుల రోడ్డుగా చేస్తున్నారని, అక్కడి ప్రజలను ఒప్పించి వారికి ఇంటి స్థలాలు ఇచ్చి పరిహారం ఇవ్వాలని కోరారు. తర్వాత రోడ్డు వెడల్పు చేయాలని, అయ్యప్పస్వామి దేవాలయం వెనుక వంక స్థలంలో ప్లాట్లు వేసిన వారి నుంచి డబ్బులు తీసుకొని వంకను కబ్జా చేయాలని చూస్తున్నారని విమర్శించారు. శివన్న నగర్‌లో సర్వే నెంబర్ 90బిలో బంకులు వేసి కబ్జా చేయాలని చూస్తున్నారని తెలిపారు. అండర్ గ్రౌండ్ పనులు చేసిన కాంట్రాక్టర్‌కు రూ.2 కోట్ల బిల్లులు పెండింగ్ ఉన్నాయని, పనులు మధ్యలో వదిలేసి వెళ్లారని చెప్పారు. జనరల్ ఫండ్ కింద యుజిడి క్యాప్స్ వేస్తున్నారని, కుక్కల బెడదను అరికట్టడంలో అధికారులు విఫలం చెందారని మండిపడ్డారు. కమిషనర్ గంగిరెడ్డి, కౌన్సిలర్లు రామదాసు గౌడ్, బోయ బజారి, ఇసాక్, నాగేశప్ప, రాజారత్నం, డిస్ కేశవ రెడ్డి, శివ ప్రసాద్ పాల్గొన్నారు.



ప్రశ్నిస్తున్న టిడిపి నాయకులు దయాసాగర్, రాందాస్ గౌడ్



మున్సిపల్ సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

వ్యవసాయ రంగాన్ని రక్షించుకుందాం

- 15న బహిరంగ సభను జయప్రదం చేయండి : ఎఐకెఎస్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వ్యవసాయ రంగాన్ని పరిరక్షించుకుందామని ఎఐకెఎస్ జిల్లా నాయకులు గోవిందు, హనుమంతు, లక్ష్మీ నరసయ్య, అబ్దుల్లా తెలిపారు. ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా ఈనెల 15న జరిగే బహిరంగ సభ గోడపత్రికను గురువారం సుందరయ్య భవన్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ ఏడాది రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో భూగర్భ జల మట్టాలు ప్రమాద స్థాయికి పడిపోయాయని, రైతులు బోరు, బావులు కింద పండించే పంటలు కూడా చేతికందకుండా ఎండిపోయాయని తెలిపారు. రైతుల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, తాగేందుకు నీరు కూడా దొరకని పరిస్థితి కనిపిస్తోందని చెప్పారు. జిల్లాను కరువుగా ప్రకటించాలని రైతులు ఆందోళన చేసినా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సురేష్, చంద్ర, రమేష్, రాజు, రాముడు పాల్గొన్నారు.



గోడపత్రికను విడుదల చేస్తున్న నాయకులు

యువకుని దారుణ హత్య

ప్రజాశక్తి-కోసిగి

కోసిగిలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యారు. కోసిగిలోని గాంధీనగర్‌కు చెందిన జిల్లెడాకుల నాగరాజు (22) గురువారం తెల్లవారు జామున టివిఎస్ షోరూం వెనుక భాగంలో బైక్‌పై బహిర్భూమికి వెళ్లారు. నాగరాజును గుర్తుతెలియని వ్యక్తులు వేటకొడవళ్లు, గొడ్డలితో దారుణంగా హత్య చేశారు. మృతుడు కోసిగిలోని నరసింహ ట్రేడర్స్ దుకాణంలో హమాలీగా పని చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న సిఐ ఎరిషావలీ, ఎస్ఐ సతీష్ కుమార్ పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. ప్రశాంతంగా ఉన్న కోసిగిలో యువకుని దారుణ హత్యతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. హమాలీ పని చేస్తున్న వ్యక్తిని ఇంత దారుణంగా హత్య చేయడంలో ఆంతర్యం ఏమిటని కోసిగిలో చర్చనీయాంశంగా మారింది. హత్య కేసును ఛేదించేందుకు సిఐ ఎరిషావలీ ఆధ్వర్యంలో పోలీసులు డాగ్ స్క్వాడ్ బృందాలతో దర్యాప్తును ముమ్మరం చేశారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల అధికారి తనిఖీ

ఆదోని : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరీ రివిజన్-2024లో భాగంగా గురువారం పట్టణంలోని పాత టిజిఎల్ పాలిటెక్నిక్ కళాశాల, నిజాముద్దీన్ కాలనీలోని మసూదియా ఉర్దూ పాఠశాల పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తనిఖీ చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ తాగునీరు, టాయిలెట్స్, విద్యుత్, ర్యాంపు వంటి సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఓటర్లు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఓటరు జాబితా సిద్ధం చేశామన్నారు. ఎఇఆర్, తహశీల్దార్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిలు విడుదల చేయాలి

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.నాగమణి, జిల్లా అధ్యక్షులు జె.ఎల్లప్ప డిమాండ్ చేశారు. గురువారం స్థానిక వీవర్స్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఎం.రాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అధికారంలోకి రాకముందు ఒకమాట, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకమాట చెబుతూ ఉద్యోగులను, ఉపాధ్యాయులను వైసిపి ప్రభుత్వం దగా చేస్తోందని విమర్శించారు. 2022 సంవత్సరం జనవరి నెల డిఎ అరియర్స్, పిఎఫ్ వారికి జమ చేసి, సిపిఎస్ వారికి ఇవ్వాల్సిన 90 శాతం క్యాష్ జమ చేయలేదని తెలిపారు. అలాగే ఎపిజిఎల్ఐ, జిపి పిఎఫ్ లోన్లు గత మార్చి నెల నుంచి చెల్లించడం లేదన్నారు. ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు రావాల్సిన అన్ని ఆర్థిక బకాయిలనూ తక్షణమే చెల్లించాలని, లేకపోతే ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. అనంతరం ఎమ్మిగనూరు (గ్రామీణ, పట్టణ) శాఖలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా జిల్లా కార్యదర్శులు దేవపాల్, దావీదు, నరసింహులు వ్యవహరించారు.

ఎమ్మిగనూరు గ్రామీణ కమిటీ :

గౌరవాధ్యక్షులుగా పి.శాంతిరాజు, అధ్యక్షులుగా అబ్దుల్ లతీఫ్, సహాధ్యక్షులుగా తులసమ్మ, సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా ఎం.రాజు, ఆర్థిక కార్యదర్శిగా హనీఫ్ అహ్మద్, కార్యదర్శులుగా కేశన్న, సంపత్ కుమార్, వెంకటేష్, మంజుల, చిన్న ఎల్లప్ప, జ్యోత్స్న, పవిత్ర, బాలరాజు, తాతయ్య, జిల్లా కౌన్సిలర్లుగా మల్లాది నాగరాజు, బి.రామాంజినేయులు, డి.పద్మావతి, భాస్కర్‌ను ఎన్నుకున్నారు.

ఎమ్మిగనూరు పట్టణ కమిటీ

గౌరవాధ్యక్షులుగా కె.నాగరాజు, అధ్యక్షులుగా డి.అల్లాబకాష్, సహాధ్యక్షులుగా రామ్మోహన్, విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా పి.ప్రకాష్, ఆర్థిక కార్యదర్శిగా బి.నాగరాజు, కార్యదర్శులుగా సంజన్న, నాగేష్, ఉమా, లింగమూర్తి, రాజశేఖర్, మాదన్న, నాగూర్ బాష, ఫక్రుద్దీన్, ఎం.సుధాకర్, వన్నూరప్ప, జిల్లా కౌన్సిలర్లుగా మల్లారి భీమేష్, ఎం.హనుమంతు, ఎంకె.విజయలక్ష్మిని ఎన్నుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగమణి



అధిక ధరకు బాణసంచా అమ్మకాలు

- ఎంఆర్‌పి కన్నా మూడు రేట్లు అధికం

ప్రజాశక్తి - హొళగుంద

గౌరమ్మ పండగ సందర్భంగా గ్రామాల్లో యువత, పిల్లలు పేల్చే బాణసంచా ధర మోత మోగుతోంది. హొళగుందలో బాణసంచా అమ్మకాల వ్యాపారులు, అధికారులకు మామూలు ఇచ్చి ముందస్తు జాగ్రత్తలు లేకుండా అమ్మకాలు నిర్వహించారు. బాణసంచా ధరలు ఎంఆర్‌పి కంటే మూడు రెట్లు అధికంగా అమ్మి భారీగా దోపిడీకి పాల్పడ్డారు. గౌరమ్మ పండగ సందర్భంగా రెండు రోజుల్లోనే రూ.లక్షల్లో వ్యాపారం జరగడంతో భారీగా సంపాదించారు. వ్యాపారులు బాణ సంచా అమ్మకాలు బహిరంగ ప్రదేశంలో నిర్వహించడంతో ప్రమాదం జరిగితే అందుబాటులో నీరు నిల్వ ఉండేలా చూసుకోవాలి. ఆర్‌డిఒ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ నిబంధనలను బేఖాతరు చేస్తూ అమ్మకాలు నిర్వహించారు. ఇరుకు అంగట్లో వ్యాపారాలు నిర్వహించడం వల్ల ప్రమాదం జరిగితే భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది. స్థానిక పోలీసులు ఇలాంటి వాటిని అరికట్టాల్సి ఉండగా చోద్యం చూడడం విమర్శలకు తావిస్తోంది. ఇలాంటి సంఘటనలు పునావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

12న ముందస్తు క్రిస్మస్ సంబరాలు

ఆదోని : ఆదోని క్రిస్టియన్ చర్చెస్ ఫోరం (ఎసిసిఎఫ్) ఆధ్వర్యంలో ఈనె 12న జరిగే సపోజ్ క్రిస్మస్ వేడుకలను జయప్రదం చేయాలని ఎసిసిఎఫ్ పాస్టర్లు కోరారు. గురువారం స్థానిక ఏసయ్య దీవెన బేతేలు మందిరంలో సపోజ్ క్రిస్మస్ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు విక్టోరి పాల్ ఫిలిప్, జోసెఫ్ జాషువాలు మాట్లాడారు. ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా ముందస్తు క్రిస్మస్ సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీ అని తెలిపారు. ఈనెల 12న ఎస్‌కెవి ఫంక్షన్ హాలులో జరిగే సపోజ్ క్రిస్మస్ సంబరాలను క్రైస్తవులు విజయ వంతం చేయాలని కోరారు. పాస్టర్లు వి.ఆశీర్వాదం, ఏసురాజు, కిరణ్, తిమోతి, ఆంతోనీ, దేవదాస్, ప్రకాష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టాలి : ఎస్‌టియు

ఆదోని : మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టాలని ఎస్‌టియు రాష్ట్ర అదనపు కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం ఆదోనిలోని ఎస్‌టియు భవన్‌లో సుధాకర్ అధ్యక్షతన జరిగిన డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విద్యా శాఖ ఆధీనంలో ఉన్న మండల, జిల్లా పరిషత్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులు మూడేళ్లలో రెండు పర్యాయాలు జరిగేవని తెలిపారు. డిసెంబర్‌లో బదిలీలు, ఉద్యోగోన్నతులు షెడ్యూల్ విద్యాశాఖ విడుదల చేయకపోతే డైరెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. లోక్య నాయక్, రమేష్ నాయుడు, సుంకన్న, గోపాల్, రవి, వీరచంద్ర యాదవ్, భీమరాజు, రామకృష్ణ, మహాదేవప్ప, షేక్షావలీ, ఉరుకుందప్ప, రామాంజనేయులు, జంబులయ్య, ఆంజనేయులు, లక్ష్మణ్, రామ్మోహన్ రెడ్డి, నాగేంద్ర, జయరామ్, శ్రీరాములు, గంగ నాయక్, వెంకటరామిరెడ్డి, నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

8న అంగన్వాడీల సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అంగన్వాడీ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 8న అంగన్వాడీల సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, మండల కార్యదర్శి బి.రాముడు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి బి.గోవర్ధనమ్మ కోరారు. గురువారం స్థానిక సుందరయ్య భవన్‌లో సెక్టార్ నాయకులు ఎస్.అరుణమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుని హోదాలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాట్యుటీ, పింఛను సాధన కోసం పోరాటం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమ్మెలో సిఐటియుతో పాటు ఎఐటియుసి, ఐఎఫ్‌టియులో పని చేసే కార్యకర్తలు పాల్గొంటారని చెప్పారు. గ్రేషమ్మ, నాగలక్ష్మి, శైలజ, లక్ష్మీదేవి, వెంకటేశ్వరమ్మ, నాగలక్ష్మి, మున్ని, బండా లత, మేరీ, షమీం, జీనత్ భాను, సుజాత, లతా రాణి, నిర్మల, శకుంతల పాల్గొన్నారు.

వైద్యానికి పెద్ద పీట : సర్పంచి

మంత్రాలయం : గ్రామీణ ప్రాంతాల్లో వైసిపి ప్రభుత్వం వైద్యానికి పెద్ద పీట వేసిందని కాచాపురం సర్పంచి వై.జయమ్మ తెలిపారు. గురువారం మండలంలోని కాచాపురంలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి పల్లెలోనూ వైద్యానికి పెద్దపీట వేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. కాచాపురం సమీప గ్రామాలైన రాంపురం, 52 బసాపురం, నారాయణపురం, ఖగ్గల్ గ్రామాల్లో ఏదైనా అత్యవసర సేవలు అవసరమైతే గతంలో కల్లుదేవకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే పరిస్థితి ఉండేదని, లేదా కోసిగికి వెళ్లే వారని తెలిపారు. వైద్య అవసరాలపై ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో చర్చించి రూ.2 కోట్లు మంజూరు చేయించారని చెప్పారు. పనులను వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు.

వైసిపి పాలనకు చరమగీతం పాడదాం

- మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ పాలనకు చరమగీతం పాడదామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని 33వ వార్డులో టిడిపి నాయకులు, కార్యకర్తలు, వార్డు కమిటీ సభ్యులతో కలిసి పర్యటించారు. వార్డులోని ప్రజలతో మమేకమై వైసిపి పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసే సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు.



ఎమ్మిగనూరులో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

భక్త కనకదాసు జయంతి వేడుకలు

శ్రీభక్త కనకదాసు 536వ జయంతి సందర్భంగా పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే బీవీ స్వగృహంలో నియోజకవర్గంలోని కురువ కమ్యూనిటీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్తీక మాస పూజల్లో భాగంగా మాజీ ఎమ్మెల్యే బీవీ పట్టణంలోని 33వ వార్డులో ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రమాద బాధితునికి బీవీ పరామర్శ

పట్టణంలోని 33వ వార్డులో ప్రమాదవశాత్తు భవనం పైనుంచి కింద పడి కొన్ని నెలలుగా మంచానికే పరిమితమైన టిడిపి అభిమాని నీలకంఠను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకొని ఒక వైద్యునిగా తగిన సలహాలు, సూచనలు చేశారు.

దేవనకొండ : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ విమర్శించారు. దేవనకొండలోని ఎస్సీ కాలనీ, సంత మార్కెట్, మూగి తాత కాలనీలో పర్యటించి, టిడిపి ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను వివరించారు. పేద, మధ్య తరగతి ప్రజలపై విద్యుత్, గ్యాస్ సిలిండర్, బస్సు చార్జీలు వేసిందని, చంద్రబాబుతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ అని, వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం : మూడు రోజుల క్రితం ఎస్సీ కాలనీలో విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధమైన దళిత రామాంజనేయులు కుటుంబాన్ని కోట్ల సుజాతమ్మ పరామర్శించారు. సంఘటన వివరాలను తెలుసుకొని బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. టిడిపి మండల కన్వీనర్ విజయ్ భాస్కర్ గౌడ్, టిడిపి నాయకులు ఉచ్చీరప్ప, జనార్ధన్ రెడ్డి, రమణారెడ్డి, మాలిక్, ఆకుల వీరేష్, వెంకటస్వామి గౌడ్, రాజశేఖర్ గౌడ్, బండ్లయ్య, రాజా సాబ్, మస్తాన్, పి.కోటకొండ సుంకన్న, ముని, లతీఫ్, చిన్న రాముడు, నాగేష్, తిమ్మప్ప, మాచాపురం వీరన్న, చాంద్ బాష, రాజగోపాల్ గౌడ్ పాల్గొన్నారు.



దేవనకొండలో మేనిఫెస్టోను వివరిస్తున్న కోట్ల సుజాతమ్మ

కరువు ప్రాంత విద్యార్థులకు ఫీజులు రద్దు చేసి,

స్కాలర్‌షిప్ ఇవ్వాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు

ప్రజాశక్తి-ఆలూరు

జిల్లాలోని కరువు ప్రాంత విద్యార్థులకు అన్ని రకాల ఫీజులు రద్దు చేసి, ప్రత్యేకంగా రూ.10 వేల స్కాలర్‌షిప్ ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం ఆలూరులో రెండోరోజు ఎస్ఎఫ్ఐ 8వ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో వర్షాల్లేక, పంటలు పండక, ప్రజలకు ఉపాధి లేక వలస వెళ్తున్నారని తెలిపారు. చదువుకుంటున్న విద్యార్థులను వారి వెంట పెట్టుకొని వెళ్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వలసలను నివారించడంలో పూర్తిగా విఫలం చెందిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వలస బాధిత విద్యార్థులకు అన్ని రకాల ఫీజులు ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా సీజనల్ హాస్టల్స్ ఏర్పాటు చేయాలని, సంక్షేమ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులుగా పోతురాజు, మండల కార్యదర్శిగా లక్ష్మీనారాయణ, మండల ఉపాధ్యక్షులుగా గిరి మూర్తి, రవి, బసవరాజు, అమీర్, రేష్మ, శిల్పా, మండల సహాయ కార్యదర్శులుగా అకీరా నందన్, ఉమేష్, జగదీష్, రితిక, గాయత్రి, మండల కమిటీ సభ్యులుగా కార్తీక్, రామాంజి, మల్లి, మధు, వీరస్వామి ఎన్నికయ్యారు. ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మైనా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

- ఎంపిపి జూటూరు హేమలత, సర్పంచి నీలకంఠ

ప్రజాశక్తి - చిప్పగిరి



'జగనన్నకు చెబుదాం'లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఎంపిపి జూటూరు హేమలత, సర్పంచి నీలకంఠ అధికారులకు తెలిపారు. గురువారం డేగలహాల్ గ్రామంలో సర్పంచి నీలకంఠ, పంచాయతీ కార్యదర్శి నరసింహులు ఆధ్వర్యంలో ఎంపిడిఒ కొండయ్య అధ్యక్షతన 'జగనన్నకు చెబుదాం' నిర్వహించారు. లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు పెద్ద పీట వేస్తున్నామన్నారు. సచివాలయ అధికారులు, వాలంటీర్లు సమన్వయం చేసుకొని సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కరించుకునేలా కృషి చేయాలని తెలిపారు. ఇఒఆర్‌డి బాలన్న, ఎంఇఒ సావిత్రమ్మ, ఎపిఎం నాగార్జున, ఎపిఒ మాధవ శంకర్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ భవ్య పాల్గొన్నారు.

స్పందనలో సమస్యలు సత్వర పరిష్కారం : కమిషనర్

ఆదోని : సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి గురువారం ఆయా సచివాలయాల్లో నిర్వహించే స్పందనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి కోరారు. గురువారం ఆదోనిలోని 41, 42వ వార్డు హనుమాన్ నగర్, షరాఫ్ బజార్ సచివాలయాల్లో స్పందన నిర్వహించారు. స్పందనలో హౌస్ సైట్, వాటర్ సప్లయి, రోడ్డు నిర్మాణం, స్ట్రీట్ లైట్, డ్రెయినేజీ సమస్యలపై 10 అర్జీలు వచ్చాయని కమిషనర్ తెలిపారు. అసిస్టెంట్ ఇంజినీర్ కృపాకర్, వార్డు కౌన్సిలర్ లోకేశ్వరి, ఇన్‌ఛార్జీ నాగరాజు ఉన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు కృషి


- యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నవీన్ పాటి

ప్రజాశక్తి - గోనెగండ్ల

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకునేందుకు యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాటుపడాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బి.నవీన్ పాటి, ఎస్.నరసింహులు కోరారు. గురువారం గోనెగండ్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (బస్టాండ్)లో యుటిఎఫ్ మండల అధ్యక్షులు రామన్ ఆధ్వర్యంలో మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమాజం అభివృద్ధి చెందాలంటే విద్యా వ్యవస్థ కీలకమైందని, ఉపాధ్యాయులు కీలకంగా వ్యవహరించి సామాజిక స్పృహతో పని చేసి ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అలాగే ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలిపారు. విరమణ అనంతరం ఉద్యోగ, ఉపాధ్యాయులకు, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. లేకపోతే రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. అనంతరం ఎన్నిక అధికారి బి.నవీన్ పాటి, పరిశీలకులు నరసింహులు ఆధ్వర్యంలో యుటిఎఫ్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా విజయ్ కుమార్, అధ్యక్షులుగా పి.మద్దిలేటి, ప్రధాన కార్యదర్శిగా యు.చంద్రపాల్, సహాధ్యక్షులుగా ఉమా, అక్బర్ బాష, ఆర్థిక కార్యదర్శిగా నాగేశ్వరావు, జిల్లా కౌన్సిలర్లుగా నీలకంఠ, లింగన్న, కేశవులు, గుమ్మల బాబు, నాగలక్ష్మి, వేణుగోపాల్, ఆడిటర్‌గా పెద్ద ఖాజాన్న, 9 మందిని మండల కార్యదర్శులుగా ఎన్నుకున్నారు. రాముడు, స్వర్ణమంజుల, వెంకటరమణ, లలిత, తాజుద్దీన్, మద్దిలేటి, సోమనాథ గౌడ్, చౌడయ్య, సుంకన్న, ఉదయ్ భాస్కర్, అబ్దుల్ సలీమ్ పాల్గొన్నారు.

ఘనంగా భక్త కనకదాసు జయంతి వేడుకలు

ప్రజాశక్తి - మంత్రాలయం



మంత్రాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

శ్రీభక్త కనకదాసు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానికంగా ఉన్న కనకదాసు విగ్రహానికి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పాలకుర్తి తిక్కారెడ్డి తనయుడు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు యువత నాయకులు పన్నగ నాగశయన స్వామి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్‌నాథ్ రెడ్డి, అశోక్ రెడ్డి, సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ విజయ రామిరెడ్డి, హండే హనుమంతు, కలుదేవకుంట రాగన్న, గంగులపాడు సోమన్న, చిన్న రామాంజనేయులు, రచ్చుమర్రి రఘు, మురవణి రంగన్న, రాఘవేంద్ర, ఎస్సీ సెల్ నాయకులు ఏబు, వెంకటేశులు, నాగరాజు, బసలదొడ్డి కృష్ణ, వీరేష్ పాల్గొన్నారు. **హొళగుంద** ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ సుభాషిణి ఆధ్వర్యంలో శ్రీభక్త కనకదాసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇఒఆర్‌డి చంద్ర మౌళీశ్వర గౌడ్, చిన్న హ్యాట సర్పంచి హుస్సేన్ బాష, కనకశ్రీ యూత్ సభ్యులు ఎస్‌కె.గిరి, మంజునాథ్ గౌడ్, నరగాళ్లప్ప పాల్గొన్నారు.



సిఎంకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

సిఎంను కలిసిన ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నంద్యాల జిల్లా ఆవుకులో టన్నెల్‌ను ప్రాజెక్టును ప్రారంభించడానికి గురువారం విచ్చేసిన సందర్భంగా కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ.హాఫీజ్ ఖాన్ మర్యాదపూర్వకంగా కలిసి బొకేను అందజేసి స్వాగతం పలికారు.

అనాథాశ్రమాన్ని సందర్శించిన నారాయణ విద్యార్థులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నగరంలోని మాధవి నగర్‌లోని నారాయణ ఈ కిడ్స్ విద్యార్థులు మరియాడాన్ అనాథాశ్రమంను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కృతజ్ఞతా దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ మహమ్మద్ అల్తాఫ్ మాట్లాడుతూ నిత్యజీవితంలో పని ఒత్తిడితో సహాయం చేసిన వారిని అశ్రద్ధ చేయకుండా వారి త్యాగాన్ని గుర్తు చేసుకునేందుకు ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం చిన్నారులు ఇంటి దగ్గర నుంచి తెచ్చిన బిస్కెట్స్, పండ్లు వృద్ధులకు అందజేసి ఆదర్శంగా నిలిచారు. కార్యక్రమంలో ఆర్ఐ దుర్గాలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ రాధ, విద్యార్థులు పాల్గొన్నారు.



అనాథాశ్రమంలో పండ్లు అందజేస్తున్న నారాయణ విద్యార్థులు

ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం సొంతం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్ణయించుకొని సరైన ప్రణాళికాబద్ధంగా చదివినప్పుడే విజయం సాధిస్తారని జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి తెలిపారు. గురువారం నగరంలోని స్థానిక ఉస్మానియా కళాశాలలో మహిళా విభాగంలో కెరియర్ గైడెన్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి పాల్గొని మాట్లాడారు. పోటీ పరీక్షలలో రాణించడానికి మేధస్సు ఒకటే పనికిరాదని, సందర్భానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడమే ముఖ్యమన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, అనలిటికల్ స్కిల్స్ వంటి వాటిపై శ్రద్ధ పెట్టి, ఏ పోటీ పరీక్షకు ఎలా సాధన చేయాలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉస్మానియా కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ అజ్రాజావేద్ మాట్లాడుతూ విద్యార్థి దశలో ప్రశ్నించడం నేర్చుకోవాలన్నారు. మహిళలు సాధికారత సాధించినప్పుడే, ఉస్మానియా మహిళా కళాశాలలో చదివినందుకు సార్థకత ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ సయ్యద్ సమీవుద్దీన్ ముజమ్మిల్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి వి.శ్రీకాంత్ రెడ్డి, కళాశాల ప్లేస్మెంట్ అధికారి, తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ మండి అన్వర్ హుస్సేన్, మహిళా విభాగం స్పెషల్ ఆఫీసర్ కె.బిబి నవాజ్, ప్లేస్మెంట్ అధికారులు కుమారి ఎం.ఎస్ తైయ్యిబా బిబి, ఎం.జరుబీనా తహసీన్, వివిధ శాఖల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి

నైపుణ్యంతో పాటు నిరంతరం అధ్యయనం చేయాలి

- పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి వి.దివ్య

ప్రజాశక్తి - పత్తికొండ

న్యాయవాద వృత్తిలో రాణించాలంటే నైపుణ్యం పెంచుకోవడంతో పాటు నిరంతరం అధ్యయనం చేయాలని పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి వి.దివ్య సూచించారు. గురువారం పత్తికొండ పట్టణంలోని బార్ అసోసియేషన్‌లో నూతన న్యాయవాదులుగా ఉప్పర నాగరాజు, జూటూరు నాగభూషణం సభ్యత్వం తీసుకున్నారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.రంగస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జడ్జి వి.దివ్య హాజరై మాట్లాడారు. న్యాయవాద వృత్తి గౌరవ ప్రదమైనదని, చట్టాల గురించి తెలుసుకొని ప్రజలకు మెరుగైన న్యాయ సేవలు అందించాలని సూచించారు. ప్రతిరోజు కోర్టుకు హాజరై కేసులకు సంబంధించిన ప్రతి విషయాలను తెలుసుకోవాలని చెప్పారు. నూతన సభ్యులకు సీనియర్, జూనియర్ న్యాయవాదులను పరిచయం చేశారు. పలువురు సీనియర్ న్యాయవాదులు మాట్లాడి తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కోశాధికారి మహేష్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు ఎల్లారెడ్డి, గోపాల్ రెడ్డి, చంద్రశేఖర్ నాయుడు, ఈరన్న మల్లికార్జున, సత్యనారాయణ, బాలభాష, దామోదరాచారి, రవి ప్రకాష్, శ్రీకాంత్ రెడ్డి, నెట్టేకల్లు, నరసింహులు, భాస్కర్, కబీర్‌దాస్, రవి, లక్ష్మన్న, హరి తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సివిల్ జడ్జి వి.దివ్య

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : వైసిపి

ప్రజాశక్తి - తుగ్గలి

అర్హులందరికీ సంక్షేమ పథకాలను వైసిపి ప్రభుత్వం అందిస్తోందని వైసిపి మండల కమిటీ అధ్యక్షులు జిట్టా నగేష్ యాదవ్, మోహన్ రెడ్డి, టిఎండి హుసేని, చాంద్ బాషాలు తెలిపారు. గురువారం మండలంలోని రాతనలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని చెప్పారు. గత టిడిపి ప్రభుత్వంలో కేవలం ఆ పార్టీ కార్యకర్తలకు మాత్రమే సంక్షేమ పథకాలు అందేవని, నేడు జగనన్న ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల అందుతున్నాయని చెప్పారు.

కార్యక్రమంలో ఈఓఆర్‌డి తిరుపాల్, సర్పంచ్ రాచప్ప, తుగ్గలి మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, నాగభూషణం రెడ్డి, కార్యదర్శి శివకుమార్, సురేషు, పులికొండ తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల లబ్ధి వివరాల బోర్డును ప్రారంభిస్తున్న నాయకులు

దాడిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూల్ నగరంలో యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తి దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. మూడో పట్టణ సిఐ డి.మురళీధర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామానికి చెందిన మల్లెపోగు ప్రభాకర్(48) గత కొంతకాలంగా భార్యతో విడిపోయి కర్నూల్ నగరంలోని బి.క్యాంపు క్వార్టర్స్‌లోని ఓ పాడుబడిన గదిలో నివాసం ఉంటున్నాడు. పెయింటింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం బిర్లా గేటు సమీపంలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి దగ్గరలో ఉండగా గుర్తు తెలియని వ్యక్తి రాయితో దాడి చేసి సైకిల్‌పై పారిపోయాడు. ఘటన స్థలంలో ఉన్న తెలంగాణ రాష్ట్రం చిన్నంబావి మండలం వెలుగొండ గ్రామానికి చెందిన సూర్య శేఖర్ గాయాలతో పడి ఉన్న ప్రభాకర్‌ను ప్రభుత్వ హాస్పిటల్‌లో చేర్పించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే ప్రభాకర్ మృతి చెందినట్లు నిర్ధారించారు. సూర్యశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసి విచారిస్తున్నామని సిఐ తెలిపారు.



మృతి చెందిన మల్లెపోగు ప్రభాకర్



సిఎంకు స్వాగతం పలికిన కలెక్టర్

సిఎంకు స్వాగతం పలికిన ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నంద్యాల జిల్లాలోని అవుకు రెండో టన్నెల్‌ను ప్రారంభించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఓర్వకల్లు ఎయిర్ పోర్టుకు గురువారం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఓర్వకల్లు ఎయిర్ పోర్టులో ముఖ్యమంత్రికి ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. కర్నూలు ఎంపీ డా.సంజీవ్ కుమార్, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, డిఐజి సెంథిల్ కుమార్, ఎస్‌పి జి.కృష్ణకాంత్, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, మునిసిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎర్రకోట చెన్న కేశవ రెడ్డి, హాఫీజ్ ఖాన్, జె.సుధాకర్, శిల్పా చక్రపాణి రెడ్డి, తోగూరు ఆర్థర్, కంగాటి శ్రీదేవి, కర్నూలు నగర మేయర్ బివై.రామయ్య, కుడా చైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీ బుట్టా రేణుక, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ విద్యా సాగర్, ఎర్రకోట జగన్ మోహన్ రెడ్డి, ప్రదీప్ కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు. అనంతరం ముఖ్యమంత్రి హెలిక్యాప్టర్ ద్వారా మధ్యాహ్నం 12 గంటలకు నంద్యాల జిల్లా అవుకు టన్నెల్ వద్దకు బయలుదేరి వెళ్ళారు.

ఓటు హక్కు నమోదుకు 2, 3 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఓటు హక్కుపై ఈ నెల 2, 3వ తేదీలలో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, 137వ అసెంబ్లీ నియోజక వర్గం కర్నూల్ నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవ్ తేజ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలు నగర ప్రజలందరూ తమ తమ సంబంధిత పోలింగ్ స్టేషన్లు సందర్శించి ఓటు వున్నదో లేదో తనిఖీ చేసుకోవాలని, ఒకవేళ లేనిపక్షంలో సంబంధిత ఫారం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జనవరి 1, 2024 నాటికి 18 సంవత్సరాలు పూర్తి అయిన యువతీ యువకులు ఈ స్పెషల్ క్యాంపెయిన్ నందు నమోదు చేసుకొనే అవకాశం ఉందన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో బూత్ లెవల్ ఆఫీసరు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో వుంటారని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భూ రక్ష పథకాన్ని పరిశీలించిన మండల విస్తరణాధికారి

ప్రజాశక్తి - వెల్దుర్తి : వెల్దుర్తి మండల కేంద్రంలోని బుక్కాపురం గ్రామపంచాయతీ పరిధిలో జరుగుచున్న జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్షా పథకం సర్వే కార్యక్రమాన్ని మండల విస్తరణ అధికారి నరసింహులు గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులు ఇలాగేనా..?

- సచివాలయం సిబ్బందిపై డిప్యూటీ సిఇఒ ఆగ్రహం

- డ్యూటీ సర్టిఫికెట్ లేనిదే జీతాలు పెట్టవద్దు.. - విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

ప్రజాశక్తి - రుద్రవరం

సచివాలయం రికార్డులను ఇలాగేనా నిర్వహించేది.. అని డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి సిబ్బందిపై మండిపడ్డారు. మండల పరిధిలోని ఆర్ నాగులవరం రుద్రవరం 1, 2, 3 గ్రామ సచివాలయాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ సచివాలయంలోని మూమెంట్ రిజిస్టర్ స్పందన రిజిస్టర్ గ్రీవెన్స్ రిజిస్టర్‌లను పరిశీలించారు. రుద్రవరం మూడు గ్రామ సచివాలయంలో రికార్డుల నిర్వహణ సరిగా నిర్వహించడం లేదని దీన్ని బట్టి చూస్తే విధుల పట్ల ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అర్థమవుతుందిపై మండిపడ్డారు. రికార్డుల నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నవంబర్ నెలకు సంబంధించి రికార్డుల నిర్వహణ రిపోర్టును తనకు అందజేయాలని ఎంపీడీవో మధు సూదన రెడ్డిని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్ నాగులవరం గ్రామ సచివాలయంలో కార్యదర్శి సిబ్బంది రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వహిస్తున్నారని సంతృప్తి వ్యక్తం చేయగా.. రుద్రవరం ఒకటి, రెండు, మూడు గ్రామ సచివాలయంలో రికార్డుల నిర్వహణ సంక్రమంగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానంగా మూమెంట్ రిజిస్టరు స్పందన రిజిస్టర్లు గ్రీవెన్స్ రిజిస్టర్‌లను సక్రమంగా నిర్వహించాలని అలా కాకుండా సచివాలయ సిబ్బంది ఇష్టానుసారంగా రికార్డుల నిర్వహణ ఉందన్నారు. ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా హాజరు వేయాలన్నారు. డిడి డిజిటల్ అసిస్టెంట్ వెల్ఫేర్ అసిస్టెంట్ మహిళా పోలీసు తదితర సిబ్బంది వచ్చినప్పుడు తప్పనిసరిగా హాజరువేయాలని ఫీల్డ్‌కు వెళ్లేటప్పుడు మూమెంట్ రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ప్రతిరోజు మూడు నుండి ఐదు గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాల్సి ఉంటుందన్నారు. దీంతో ఉదయం మధ్యాహ్నం సాయంత్రం మూడుసార్లు తప్పనిసరిగా హాజరు వేయాల్సి ఉందన్నారు. ఆర్ నాగులవరం గ్రామ సచివాలయం రికార్డుల నిర్వహణకు రుద్రవరం మూడు గ్రామ సచివాలయాల రికార్డుల నిర్వహణకు వ్యత్యాసం ఉందన్నారు. స్పందన కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించిన చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందికి సూచించామన్నారు. ప్రజల సమస్యలను గ్రామంలోనే పరిష్కరించేందుకే ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిందని సచివాలయ వ్యవస్థ పై ప్రజలకు నమ్మకం కలిగించేలా సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. రుద్రవరంమేజర్ పంచాయతీలో రెగ్యులర్ ఈవో లేకపోవడంతో ఇంచార్జి ఈవో బాధ్యతలు నిర్వహిస్తుండడం తో గ్రామ సచివాలయాల సిబ్బంది విధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఈవో సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే రెగ్యులర్ ఈవోని నియమించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. డిసెంబర్ రెండవ వారం లేక మూడో వారంలో మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్ ఏఈ వెంకటరాముడు, పంచాయతీ కార్యదర్శులు సచివాల సిబ్బంది ఉన్నారు.



రుద్రవరం సచివాలయం-2లో రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి



సిఎంకు స్వాగతం పలుకుతున్న సిహెచ్ మద్దయ్య

సిఎంను కలిసిన సిహెచ్ మద్దయ్య

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నంద్యాల జిల్లా ఆవుకులో టన్నెల్‌ను ప్రాజెక్టును ప్రారంభించడానికి గురువారం విచ్చేసిన సందర్భంగా వైసిపి రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మద్దయ్య మర్యాదపూర్వకంగా కలిసి బొకేను అందజేసి స్వాగతం పలికారు.

సుండిపెంట సమస్యలు పరిష్కరించాలి

ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శికి వినతి

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

సున్నిపెంట గ్రామ పంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఐఎఫ్‌టియు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వై.ఆశీర్వాదం డిమాండ్ చేశారు. గురువారం శ్రీశైలంలోని 4వ గ్రామ సచివాలయంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ బాలు నాయక్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సుండిపెంట గ్రామ పంచాయతీలో ప్రజలు నివాసముంటున్న, కొత్తగా నిర్మాణం చేసుకుంటున్న వారికి, ఒకే ఇంట్లో రెండు మూడు కూటుంబాల వారు కలసి ఉన్న ఇండ్లకి విద్యుత్ మీటర్లు ఇప్పించాలని కోరారు. కొన్ని చోట్ల వీధిలైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే కాలనీలలో వీధిలైట్లు, చెత్త కుండీలు ఏర్పాటు చేయాలన్నారు. జి.టేపు క్వార్టర్స్ వెనక భాగంలో డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయించి, డిడిటి మందు, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని అన్నారు. స్పందించిన ఆయన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వై.శీను, గోపాల్, వెంకటేశ్వర్లు, కులమయ్య తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శికి వినతిని అందచేస్తున్న నాయకులు

క్రీడా పోటీలకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

ప్రజాశక్తి - బేతంచెర్ల

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు అర్హులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎంపీడీవో దస్తగిరి బాబు గురువారం తెలిపారు. ఈ క్రీడా పోటీలకు మండలంలోని గ్రామీణ వార్డు మండల నియోజకవర్గస్థాయి రాష్ట్రస్థాయిలలో డిసెంబర్ 15 నుండి ఫిబ్రవరి మూడవ తేదీ వరకు కబడ్డీ క్రికెట్, కోకో, వాలీబాల్, బ్యాట్మెంటన్ పోటీలు జరుగుతాయని అన్నారు. ఈ క్రీడా పోటీల కు 15 సంవత్సరాలు పైబడి న యువతి యువకులు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

రాంకోలో ఉపాధి అవకాశాలు కల్పించాలి

-కొలిమిగుండ్లను కరువు మండలంగా ప్రకటించాలి

- వైసిపి మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

కొలిమిగుండ్ల మండలంలోని రాంకో సిమెంట్స్ ఫ్యాక్టరీలో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగం, ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని, కొలిమిగుండ్లను కరువు మండలంగా ప్రకటించాలని వైసిపి మండల కన్వీనర్ అంబటి గురివిరెడ్డి సిఎం జగన్ మోహన్ రెడ్డిని కోరారు. గురువారం అవుకు టన్నెల్ ప్రారంభించడానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డితో కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాంకో సిమెంట్స్ ఫ్యాక్టరీ పరిశ్రమలో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగం అవకాశాలు ఇవ్వకుండా పరిశ్రమ వారు ఇతర ప్రాంతాలకు చెందిన వారికి ఉద్యోగ అవకాశాలు ఇస్తున్నారన్నారు ఇప్పటికైనా భూముల కోల్పోయిన వారికి ఉద్యోగ అవకాశాలు మరియు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఇవ్వాలని సిఎం జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు.



సిఎం జగన్ మోహన్ రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న అంబటి గురివిరెడ్డి

అనుమతి విత్తనాలనే ప్రాసెసింగ్ చేయాలి : ఎడిఎ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : విత్తనాల ప్రాసెసింగ్‌లో అవకతవకలు జరిగిన, ప్రభుత్వము అనుమతి ంచిన విత్తనాలను మాత్రమే ప్రాసెసింగ్ చేయాలని నిబంధనల ను అతి క్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సహాయ వ్యవసాయ సంచాలకులు డి.రాజశేఖర్ హెచ్చరించారు. గురువారం మండల వ్యవసాయ అధికారి ప్రసాద రావుతో కలసి సహాయ వ్యవసాయ సంచాలకులు డి.రాజశేఖర్ నంద్యాల మండలములో గల ప్రత్తి విత్తన శుద్ధి కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమములో బాగంగా భవ్య సీడ్స్, వినాయక అగ్రో ఏజెన్సీస్ బబ్బూరి ఆగ్రో ఇండస్ట్రీస్ విత్తన శుద్ధి కేంద్రాలలో తనిఖీలు నిర్వహి ంచి రికార్డులను పరిశీలించారు. డి. రాజశేఖర్ మాట్లాడుతూ కేవలము వ్యవసాయ శాఖ ద్వారా అనుమతి పొందిన కంపెనీల విత్తనాలు మాత్రమే ప్రాసెసింగ్ చేయాలని, అలాగే విత్తన శుద్ధి చేసే ప్రతి ఒక్కరూ కాలుష్య నియంత్రణా మండలి నుండి అనుమతులు పొంది వుండాలని తెలిపారు. ఈ కార్యక్రమములో భాగంగా వినాయక ఆగ్రో ఇండస్ట్రీస్‌లో 3 లాట్‌లలో హెచ్‌టి కాటన్ స్ట్రిప్ టెస్ట్ నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ విత్తన శుద్ధి చేసిన తరువాత వచ్చే వ్యర్థాలకు ఈటీపీ ప్లాంట్‌ని ఉపయోగి ంచాలని, ప్రతి ఒక్క విత్తన శుద్ధి కేంద్రం యజమాని విత్తన శుద్ధి కేంద్రానికి సంబందించిన అన్ని రిజిస్టర్లు నిర్వహించాలని తెలియజేశారు. అలాగే విత్తన శుద్ధి పూర్తయిన తరువాత మిగిలిన రెమినెన్స్ విత్తనాలకు సంబంధించి రిజిస్టర్ నిర్వహించాలని తెలిపారు.




ప్రాసెసింగ్ కేంద్రంలో విత్తనాలను పరిశీలిస్తున్న ఏడీఏ రాజశేఖర్, ఏఓ ప్రసాదరావు తదితరులు

శ్రీశైలంలో ఉచిత సామూహిక సేవలు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలంలోని మల్లికార్జున స్వామి వారి జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రంను పురస్కరించుకొని గురువారం ఉచిత సామూహిక సేవలను నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండి ఆన్లైన్లో రిజిస్టర్ చేసుకున్న వారికి ఉచిత సేవలో పాల్గొనే అవకాశం కల్పించినట్లు తెలిపారు. చంద్రావతి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఈ కళ్యాణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరి గోత్రనామాలతో సంకల్పం చెప్పారు. కార్యక్రమం

అనంతరం స్వామి అమ్మవార్ల దర్శనం కల్పించారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ రెండు లడ్డు ప్రసాదాలు, కైలాస కంకణాలు అందజేశారు. దేవస్థానం అన్నపూర్ణ భవనంలో భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్థానికులతో పాటు మార్కాపురం, చిత్తూరు, గుంటూరు తదితర ప్రాంతాల భక్తులు, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.





ముఖ్యమంత్రిని కలిసిన చల్లా విగ్నేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి - అవుకు

మండలంలోని మెట్టుపల్లె గ్రామ సమీపంలో ఉన్న టన్నెల్ రెండు ప్రారంభోత్సవానికి వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని దివంగత ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి పెద్ద కుమారుడు చల్లా విగ్నేశ్వర్ రెడ్డి పుష్పగుచ్చాన్ని అందించి స్వాగతం పలికారు. అలాగే వైసిపి నాయకులు మండల అధ్యక్షుడు చల్లా రాజశేఖర్ రెడ్డి, పిఏ సి ఎస్ బ్యాంకు చైర్ పర్సన్ చల్లా విజయభాస్కర్ రెడ్డి, నంద్యాల జిల్లా వైసిపి ప్రధాన కార్యదర్శి ముడియాల జయచంద్రారెడ్డి, వైసీపీ నాయకులు పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి,మోట్ల రామిరెడ్డి తదితరులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు.

కలియుగ వైతాళికుడు గురజాడ

ప్రజాశక్తి - డోన్

కలియుగ వైతాళికుడు గురజాడ అప్పారావు అని ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం డోన్ పట్టణం లోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా, ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ ఉపాధ్యాయులు రాధ,దేవేంద్రప్ప మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి,రవిశేఖర్, వెంకట రమణ, వెంకట లక్ష్మీ, రఘునాథ్, ఎస్తేరమ్మ, లక్ష్మీకాంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం వెంకట సుబ్బారెడ్డి

రాక్షస పాలన ఎవరిదో ప్రజలందరికీ తెలుసు

- రాష్ట్ర జలమండలి ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి - చాగలమర్రి

రాక్షస పాలన ఎవరిదో రాష్ట్ర ప్రజానీకానికి బాగా తెలుసునని రాష్ట్ర జలమండలి ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యానించారు. గురువారం చాగలమర్రి మండలం శెట్టివీడు గ్రామంలో వైసీపీ నాయకుడు పెనుగొండ రామనారాయణరెడ్డి వైద్య పరీక్షల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన పది లక్షల రూపాయల విలువగల చెక్కును అతని భార్య పెనుగొండ రాధికకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన ఉందని టిడిపి ఆరోపించడాన్ని తీవ్రంగా ఖండించారు. గత తెలుగుదేశం పాలనలో రాక్షసులుగా, దౌర్జన్యకారులుగా ఎవరు వ్యవహరించారో ప్రజానీకానికి తెలుసన్నారు. వైసిపి ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని కేవలం టిడిపి నాయకులే విమర్శిస్తున్నారన్నారు. కానీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పార్టీలకు, వర్గాలకు, కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. దీంతో రాష్ట్ర ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని తెలిపారు. రైతుల కోసం డిసెంబర్ 15 వరకు కేసీ కెనాల్కు నీటిని విడుదల చేస్తామన్నారు.

కార్యక్రమంలో జిల్లా జెసిఎస్ అధ్యక్షుడు షేక్ బాబూలాల్, వైసిపి మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, గ్రామ సర్పంచ్ నల్లమల లక్ష్మీదేవి, మండల జెసిఎస్ కన్వీనర్ వెంకటరామిరెడ్డి , జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్ రెడ్డి, బోర్వెల్ కాంట్రాక్టర్ వెంకటరమణ, తోడేండ్లపల్లె సర్పంచ్ గోవిందయ్య, కేసీ కెనాల్ ఏఈ రమేష్, వైసిపి నాయకులు మహబూబ్ బాషా, చిన్న ఓబులేసు , పెద్ద రాముడు, మహబూబ్ వలి డీలర్ నరసింహ, తోపుల రమణ, రఘురామయ్య, ముల్లా ఇబ్రహీం, మండల ప్రచార కార్యదర్శి పెయింటర్ రఫీ తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేస్తున్న గంగుల ప్రభాకర్ రెడ్డి



వాటర్ ప్లాంట్ క్లీనింగ్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

వాటర్ బెడ్లు క్లీనింగ్ పనులను పరిశీలించిన చైర్మన్

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణంలోని పేరంటాలమ్మ గుడి దగ్గర పంప్ హౌస్లో నీటిని చేసే కేంద్రం వద్ద క్లారి ఫ్లోకులేటర్ శుభ్రం చేస్తున్నందువలన గురువారం పట్టణంలో నీటిని వదలలేదని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. అనంతరం గురువారం వాటర్ ప్లాంట్లో వాటర్ బెడ్లు క్లీనింగ్ పనులను మున్సిపల్ చైర్మన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం రాత్రి అంతా పనులు పూర్తి చేసి పట్టణ ప్రజలకు నీటి సరఫరా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి,డిఈ రసూల్,ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చెంచు గిరిజన గర్భిణులకు మౌలిక వైద్య సేవలు

- మున్సిపల్ చైర్మన్ మారుఫ్ ఆసియా

ప్రజాశక్తి - ఆత్మకూర్

నల్లమల అటవీ ప్రాంతంలో నివాసముంటున్న చెంచు గిరిజన గర్భవతులకు ప్రభుత్వ వైద్యశాలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి వారి ఆరోగ్య జాగ్రత్తలపై ప్రత్యేక చొరవ తీసుకుంటామని ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రాథమిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆర్డిటి స్వచ్ఛంద సేవ సంస్థ ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ రాయుడు, వెంకటరమణ, ప్రసన్న లక్ష్మి మర్యాదపూర్వకంగా ఆహ్వానం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా అనేక వైద్య కార్యక్రమాలు చేపట్టిందని, కేంద్ర ప్రభుత్వం ప్రతినెల గర్భవతులకు స్కానింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయం అన్నారు. ఆర్డిటి స్వచ్ఛంద సేవ సంస్థ అందిస్తున్న సేవలు మరువలేనివని వివరించారు. ఆ సంస్థ ద్వారా ఎంతోమంది గిరిజన మహిళలకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తూ వారి ఆరోగ్య జాగ్రత్తలపై ప్రతి నెల 30వ తేదీన కార్యక్రమం చేపట్టడం ఎంతో మంచి పరిణామం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిటి వైద్యాధికారులు, సూపర్వైజర్లు అంజమ్మ, ప్రభుత్వ వైద్యశాల ఏఎన్ఎంలు, హెడ్ సిస్టర్లు సరోజ, వసంత, రాఘవ కృష్ణ, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు అందిస్తున్న మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ ఆసియా



'నలంద' యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణం నూనెపల్లె ఎన్జీవోస్ కాలనీ రోడ్లో ఉన్న నలంద జూనియర్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం ఇంటర్మీడియట్ ఆఫీసర్కి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నిరంజన్, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కళాశాల నడుస్తుందని కళాశాలకు కావాల్సిన రెండెకరాల ఆట స్థలం ఎక్కడ ఉందని విద్యార్థులకు సరిపడా విశాలమైన తరగతులలో ఉన్నాయా అని ప్రశ్నించారు. అదేవిధంగా కళాశాలలో హాస్టల్లో నిర్వహించడానికి అనుమతులు ఎక్కడున్నా యన్నారు. వెంటనే కళాశాల యాజమాన్యం పై చర్యలు తీసుకొని కళాశాల గుర్తింపును రద్దు చేయాలని, విద్యార్థులకు గాయాలు చేసిన యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ నాయకులు మధు కిరణ్, వేణుగోపాల్ వీరమధు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంపై యువత ముందుకు రావాలి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

రక్తదానంపై యువత ముందుకు రావాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ దస్తగిరి పర్ల అన్నారు. గురువారం కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయం ఆవరణంలో మండల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. దస్తగిరి పర్ల ముఖ్యఅతిథిగా హాజరై రక్తదాన శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద రక్తదాన శిబిరాలను యువత ప్రోత్సహించి తలసేమియా చిన్నారులను, రక్తహీనతతో బాధపడే మాతృమూర్తులను కాపాడవలసిన బాధ్యత వారిపైనే ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి,ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగరాజు, సంజాముల మండలం మానవత సంస్థ నాయకులు నరసింహమూర్తి, కొలిమిగుండ్ల మండలం రెడ్ క్రాస్ ప్రతినిధులు హుస్సేన్ వలి, గురుమోహన్, చంద్రమోహన్ గౌడ్, వైద్యులు పాల్గొన్నారు.





ఇంటింటికి రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి : డిఎస్ఓ

ప్రజాశక్తి - పాములపాడు

ఎండియు ఆపరేటర్లు గ్రామాలలో రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని డిఎస్ఓ వెంకటరాముడు ఆదేశించారు. గురువారం తాసిల్దార్ కార్యాలయంలో ఎండియు ఆపరేటర్ల, డీలర్ల సమావేశం నిర్వహించారు. గ్రామాలలో ప్రతినెల 17వ తేదీ లోపల రేషన్ పంపిణీ చేయాలని సూచించారు. డిసెంబర్ నుండి కందిబేలు, రాగులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఎండియు ఆపరేటర్లు తమ జీతభత్యాలు సంవత్సరం నుండి రాలేదని ఆయన దృష్టికి తేవడంతో త్వరలో వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రత్న రాధిక, ఎంపీడీవో గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండాలి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

18 సంవత్సరాల లోపు బాల బాలికలందరూ బడిలో ఉండాలని ఎంఈఓ అబ్దుల్ కలాం అన్నారు. గురువారం నాడు కొలిమిగుండ్ల మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు అబ్దుల్ కలాం,రాజయ్య ఆధ్వర్యంలో ర్యాలీలో మోడల్ స్కూల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కస్తూరిబా పాఠశాల లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థిని విద్యార్థుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించి, బడి బయట బాల బాలికలను గుర్తించి బడిలో చేర్పించే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు.



నాడు నేడు పనుల్లో డిఇఇ ఈశ్వరయ్య సేవలు అమోఘం : డిఇఓ

- డిఇఇ ఈశ్వరయ్యకు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి నంద్యాల కలెక్టరేట్

డిఈఈ ఈశ్వరయ్య సర్వశిక్ష అభియాన్లో చేసిన సేవలు మరువ రానివని, నాడు నేడు పనుల్లో చేసిన సేవలు అమోఘముని జిల్లా విద్యాశాఖ అధికారి కే సుధాకర్ రెడ్డి కొనియాడారు. సర్వ శిక్ష అభియాన్లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్గా పనిచేస్తున్న ఈశ్వరయ్య తన మాతృ సంస్థ ఏపీ ఆర్టీసీ ఇంజనీరింగ్ విభాగానికి వెళుతున్న సందర్భంగా నంద్యాల పట్టణం లోని ఏపీ ఎస్ఎస్ఏ కార్యాలయంలో ఏర్పాటుచేసిన వీడ్కోలు సభలో డీఈవో కే సుధాకర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రఘునాథరెడ్డిలు ముఖ్య అతిథిగా పాల్గొని ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఈఓ మహబూబ్ బేగ్, సీఎంఓ లలిత, ఏఈ గుప్తా, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్,హరి ప్రసాద్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలు జగనన్నతోనే సాధ్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రుద్రవరం

అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించడం జగనన్నతోనే సాధ్యమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని నల్లవాగుపల్లె గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొన్నారు. గ్రామంలో ప్రతి గడపకు తిరిగి సంక్షేమ పథకాలు లబ్ధి పొందారా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వైసీపీ పాలనలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నాడని ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న వైసిపి ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి వచ్చేలా మద్దతు తెలపాలని ప్రజల కోరారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఎంపీడీవో మధుసూదనరెడ్డి, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గడప గడపకార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తదితరులు

ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన సదస్సు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

స్థానిక ప్రభుత్వా డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం పురస్కరించుకొని ఆరోగ్యం, పరిశుభ్రత అంశాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.హుస్సేన్ బాషా మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి మంచి పోషక ఆహారం తీసుకొని తద్వారా ఆరోగ్యవంతులుగా ఉండాలని, ఎటువంటి వ్యాధులు దరిచేరకుండా పరిశుభ్రతను పాటించాలన్నారు. డాక్టర్ బి.విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారి ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన దోమలు, కీటకాలు, ఈగలు రావని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్. కె.రాజన్న, ఆర్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎస్.మహేశ్వర్ రెడ్డి, మెంబర్లు బాలు, మహిళా సాధికార అధికారి నిర్మల, పద్మ, అధ్యాపకులు శివ నాగిరెడ్డి, పూర్ణేశ్వర్ రెడ్డి, శర్మ, షాహిదా, కళ్యాణి, శష్మా, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

బాలలందరూ బడిలో ఉండాలి : ఎంఇఓ

ప్రజాశక్తి - ప్యాపిలి

మండల పరిధిలోని ఆయా గ్రామాలలో దండోరా, ర్యాలీలు నిర్వహించి బడి ఈడు పిల్లలందరినీ బడిలోనే ఉండేలా ప్రోత్సహించాలని ప్యాపిలి మండల విద్యాధికారి వెంకటేశ్వర్ నాయక్ తెలిపారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఇఓ గుడిపాడులో కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, గ్రామ వాలంటీర్లు అందరూ సమావేశమై బడి బయట ఉండే చిన్నారులను గుర్తించి, గైరాజరవుతున్న వారిని విచారించి బడికి వచ్చేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. పదవ తరగతి పాస్ అయి ఇంటి దగ్గర ఉండి ఎక్కడ చేరని విద్యార్థిని విద్యార్థులందరూ కూడా ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించాలని తెలిపారు.



ప్రజాశక్తి
శుక్రవారం 01 డిసెంబర్ 2023
5
నంద్యాల





వామపక్ష నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

అవుకు రెండో టన్నెల్

జాతికి అంకితం

- నీటిని విడుదల చేసిన ముఖ్యమంత్రి
- రిజర్వాయర్‌లోకి 20 వేల క్యూసెక్కుల నీటి విడుదల



ముఖ్యమంత్రి కి ఫోటో ఎగ్జిబిషన్ గురించి వివరిస్తున్న జలవనరుల శాఖ అధికారులు



శిలాఫలకాన్ని మంత్రులతో కలిసి ప్రారంభించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లి/అవుకు

అవుకు మండలంలోని మెట్టుపల్లె గ్రామ పరిసరాల్లో ఉన్న అవుకు రెండో టన్నెల్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గురువారం జాతికి అంకితం చేశారు. తొలుత గన్నవరం విమానాశ్రయం నుంచి ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి అక్కడి నుంచి హెలీకాప్టర్ ద్వారా అవుకు సమీపంలోని హెలీప్యాడ్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి అవుకు రెండో టన్నెల్ వద్దకు చేరుకుని పైలాన్‌ను ఆవిష్కరించారు. గోరకల్లు రిజర్వాయర్ నుంచి అదనంగా 10వేల క్యూసెక్కులతో కలిపి మొత్తం 20వేల క్యూసెక్కుల నీటిని అవుకు రిజర్వాయర్‌కు విడుదల చేశారు. రెండో సొరంగం పనుల ఫోటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హెలీప్యాడ్ వద్దకు చేరుకుని కడప విమానాశ్రయానికి బయల్దేరి వెళ్లారు. రెండు టన్నెళ్ల ద్వారా 20వేల క్యూసెక్కుల నీటిని అవుకు రిజర్వాయరుకు తరలించి అక్కడి నుండి గాలేరు నగరి వరద కాలువ ద్వారా కడప, చిత్తూరు జిల్లాలకు తరలించనున్నారు. ఆ జిల్లాలో 2.60 లక్షల ఎకరాలకు సాగునీరు, 1.31 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, 640 గ్రామాల్లోని 20 లక్షల మందికి తాగునీటిని అందించనున్నారు. కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి ఎస్.బి. అంజాద్ బాషా, కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, జలవనరుల ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర రెడ్డి, మైనారిటీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు హాబీబుల్లా, ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషన్ కుమార్, జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి, నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, తోగూర్ ఆర్థర్, బ్రిజేంద్రనాథ్ రెడ్డి, శిల్పా చక్రపాణి రెడ్డి, మార్క్ ఫెడ్ చైర్మన్ పిపి.నాగిరెడ్డి, నంద్యాల జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి, కెడిసిసి బ్యాంక్ చైర్మన్ విజయ మనోహరి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేయటంతో ఎక్కడ చూసినా పోలీసు బలగాలు కనిపించాయి.

సిఎంకు ఘన స్వాగతం, వీడ్కోలు

ముఖ్యమంత్రి నంద్యాల జిల్లా పర్యటనలో భాగంగా ఓర్వకల్లు విమానాశ్రయం, అవుకు హెలీప్యాడ్ వద్ద సిఎంకు ఘన స్వాగతం లభించింది. ఓర్వకల్లు విమానాశ్రయంలో కర్నూలు ఎంపీ సంజీవ్ కుమార్, జిల్లా కలెక్టర్ జి.సృజన, డిఐజి సెంథిల్ కుమార్, ఎస్పీ జి.కృష్ణ కాంత్, జెసి నారపురెడ్డి మౌర్య, మునిసిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎర్రకోట చెన్న కేశవ రెడ్డి, హఫీజ్ ఖాన్, జె.సుధాకర్, శిల్పా చక్రపాణి రెడ్డి, తోగూరు ఆర్థర్, కంగాటి శ్రీదేవి, కర్నూలు నగర మేయర్ బి.వై.రామయ్య, కుడా చైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీ బుట్టా రేణుక, ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ విద్యా సాగర్, నాయకులు ఎర్రకోట జగన్ మోహన్ రెడ్డి, ప్రదీప్ కుమార్ రెడ్డి స్వాగతం పలికారు. అవుకు హెలీప్యాడ్ వద్ద మంత్రులు అంబటి రాంబాబు ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, శిల్పా చక్రపాణి రెడ్డి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిల్లాని సామూన్, జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు. సిఎం పర్యటన ముగిసిన అనంతరం అవుకు హెలీప్యాడ్ వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు ముఖ్యమంత్రికి వీడ్కోలు పలికారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

సిఎం పర్యటన సందర్భంగా వామపక్ష నాయకుల అరెస్టు - ఖండించిన ప్రజా సంఘాలు



అంగన్వాడి జిల్లా అధ్యక్షురాలు జి షేబా రాణికి నోటీసులుస్తున్న పోలీసులు



కొలిమిగుండ్ల పి దావీదును అరెస్టు చేసిన పోలీసులు

ప్రజాశక్తి - విలేకరులు

బనగానపల్లె : అవుకు మండలంలోని మెట్టుపల్లి గ్రామం వద్ద టన్నెల్ ప్రారంభోత్స వానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జెవి సుబ్బయ్య, ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శివ, బాలకృష్ణ, ఏఐటియుసి మండల కార్యదర్శి కుళ్ళాయి స్వామి, గిరిజన సమైక్య జిల్లా అధ్యక్షులు కాలింగిరి రాముడులను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం వామపక్ష నాయకుల ఇండ్ల దగ్గరకు వచ్చి నేతలను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు ముఖ్యమంత్రి పర్యటన అయ్యేంత వరకు పోలీస్ స్టేషన్లో ఉంచి అనంతరం బయటికి పంపారు. **బేతంచెర్ల** : ప్రజాసంఘాల నాయకులను, కార్మిక నాయకులను సీఎం జగన్మోహన్ రెడ్డిని కలవకుండా ముందుగానే అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు షేభారాణి, వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేష్ అన్నారు. నాలుగున్నర సంవత్సరాలలో కార్మికులకు ఇచ్చిన వాగ్దానంలో ఏ ఒక్కటి నెరవేర్చకపోగా నాయకులను ఇళ్ల వద్దనే నిర్బంధించి అరెస్టు చేసి స్టేషన్లో ఉంచడం సరికాదన్నారు. అరెస్టు గావించబడిన వాళ్లలో ప్రజాసంఘాల నాయకులు భార్గవ్, ఉదయ్, కుమార్ లు ఉన్నారు. **కొలిమిగుండ్ల** : ముందస్తు అరెస్టు చేయడం సమంజసం కాదు ఉద్యమాన్ని ఆపలేరు సిపిఎం మండల కార్యదర్శి కొలిమిగుండ్ల పి దావీదు అన్నారు. కొలిమిగుండ్ల మండలంలో నాపరాతి పరిశ్రమలలో, సిమెంట్ పరిశ్రమలలో భూములు తీసుకున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగాలు కల్పించాలని, తదితర సమ స్యలపై వినతిపత్రం ఇవ్వడానికి వెళ్తేంటే అడ్డుకోవడం దారుణం అవన్నారు.

పిల్లల ఎదుగుదలకు ప్రణాళిక సిద్ధం

- గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వేపై మరింత శ్రద్ధ - జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అంగన్వాడీ కేంద్రాలలో తక్కువ బరువు ఉన్న పిల్లల ఎదుగుదలకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలాని సామూన్ స్త్రీ శిశు సంక్షేమ అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ సిఎస్ కార్యాలయం నుంచి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమం – ప్రభుత్వ పథకాలు మరియు ఎస్డిజి సూచికలు, పాఠశాల విద్య, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై వివిధ కార్యదర్శులతో కలిసి కలెక్టర్లు, జేసీలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఛాంబర్ నుండి జిల్లా కలెక్టర్ వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల ఎదుగుదలకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాటు గర్భిణుల రక్తహీనతను అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలని స్త్రీ శిశు సంక్షేమ అధికారులను ఆదేశించారు. గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో సర్వే ప్రక్రియపై కేంద్ర బృందంతో వెరిఫికేషన్ ఉన్నందున బడి ఈడు పిల్లలందరూ పాఠశాలల్లోనే తప్పక ఉండేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని డీఈఓను ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైయస్సార్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాల పనులను వేగవంతంగా పూర్తి చేయించాలని పంచాయతీ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డీఈవో సుధాకర్ రెడ్డి,, పంచాయతీరాజ్ ఎస్ఈ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం

- సిసి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు - పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



గొల్లపేటలో సిసి రోడ్డు మీద పారుతున్న మురుగునీరు

ప్రజాశక్తి - సంజామల

దేశానికి పట్టుకొమ్మలు గ్రామాలు.. గ్రామాలు అభివృద్ధి చెందాలనే ఆశయంతో స్వచ్ఛభారత్ కార్యక్రమానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. ఆచరణలో క్షేత్రస్థాయిలో మాత్రం గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. సంజామల మండలంలోని అనేక గ్రామాల్లో వీధులు అపరిశుభ్రంగా మారి దుర్వాసన వెదజల్లుతున్నాయి. సిసి రోడ్లపై నీరు చేరి అపరిశుభ్రంగా మారాయి. సంజామల మండలంలోని రామిరెడ్డి పల్లె, ఎగోని, సంజామల, లింగందిన్నె, ఆలవకొండ తదితర గ్రామాలలో పరిశుభ్రత లోపించింది. సిసి రోడ్లకు ఇరువైపులా డ్రెయినేజీ కాల్వలు లేకపోవడంతో మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోతుంది. మురుగునీటిలో దోమలు వృద్ధి చెంది ప్రజలపై దాడి చేస్తుండడంతో అనారోగ్యం పాలవుతున్నారు. సిమెంట్ రోడ్లు ఉన్నా సైడ్ కాలవలు లేకపోవడంతో ప్రజలు రోడ్డుపై నిలిచిన మురుగునీటిలోనే నడుచుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. మరుగునీటిలో చిన్న పిల్లలు, వృద్ధులు జారీ కింద పడిన సంఘటన ఉన్నాయని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. మరికొన్ని గ్రామాలలో డ్రైనేజీ కాలువలు ఉన్నా పూడిక తీయకపోవడంతో చెత్తాచెదారంతో నిండిపోయి నీరు రోడ్లపైనే పారుతుంది. సంజామలలోని గొల్ల వీధిలో, యగ్గోని గ్రామం ప్రధాన రహదారిలో, రామిరెడ్డి పల్లె గ్రామంలోని ప్రధాన రహదారిలో మురుగునీరు పారుతోంది. ప్రజలు నడవడానికి కూడా వీలు లేకుండా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలపై వెళ్ళాలన్నా ప్రజలు భయపడుతున్న పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సిసి రోడ్లకు ఇరువైపులా డ్రెయినేజీ కాల్వలు నిర్మించాలని, డ్రెయినేజీల కాల్వలను శుభ్రం చేయించి మరుగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మురుగునీటి కంపు భరించలేకపోతున్నాం



సిసి రోడ్డుకు సైడు కాలువలు లేకపోవడం వలనే మురుగునీరు రోడ్ల పైన ప్రవహిస్తుంది. కొంతమంది ప్రజలు మురుగునీరును రోడ్లపై వదులుతున్నారు. మురుగునీరు ఎక్కువ కాలం నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తుండడంతో భరించలేకపోతున్నాం. సంబంధిత అధికారులు కాల్వలు నిర్మించి మురుగునీరు లేకుండా చూడాలి.

- గోపాల్, గొల్లపేట, సంజామల గ్రామం.

భారీ వర్షాలకు రైతులు అప్రమత్తం



ప్రజాశక్తి - రుద్రవరం

రానున్న డిసెంబర్ 4 ,5 తేదీలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సిరివెళ్ల మండల వ్యవసాయ అధికారి సుధాకర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాకు భారీ వర్ష సూచన ఉందని, పంటలు కోత దశలో ఉంటే వెంటనే కోతలు ముగించుకోవాలని రైతులకు సూచించారు. కల్లాల్లో ఆరబెట్టుకున్న పంటలను జాగ్రత్తగా కాపాడుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారులు సూచనలను తప్పకుండా పాటించాలన్నారు.

వాడివేడీగా కౌన్సిల్ సమావేశం

అజెండాలోని 15 అంశాలకు కౌన్సిల్ గ్రీన్ సిగ్నల్



సమావేశాన్ని నిర్వహిస్తున్న చైర్ పర్సన్ మీబున్ని సా

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గురువారం నాడు వాడివేడిగా సాగింది. మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా అధ్యక్షతన 11:45కు ప్రారంభమైన కౌన్సిల్ సమావేశం అజెండాలోని అంశాలను సభ ముందుం చారు. అధికార పక్షానికి చెందిన సభ్యులు వైస్ చైర్మన్ పంషావలి కమిషనర్‌పైన గురి పెట్టారు. కమిషనర్ కౌన్సిలర్ల పట్ల సరైన స్పందన ఉండటం లేదని... తన ఛాంబర్‌లోకి వెళ్లితే ఓ రకంగా ఫీల్ అవుతున్నారని, మున్సిపాలిటీలో జరుగుతున్న పనుల గురించి చర్చించక పోగా, ఏదైనా చెప్పు దామని వెళ్లితే తన సీటు నుండి లేచి పోతున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ సిబ్బంది చెత్త పన్ను కట్టకుంటే చెత్తను ఇంటి వద్దే పడవేసి వెళ్తున్నారని, ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ఇంత పన్ను వసూలు చేస్తున్న మళ్ళీ జనరల్ ఫండ్ నుండి గార్బేజ్ ఆటో టిప్పర్ల కు 47.91 లక్షలు ఎలా చెల్లిస్తారని తెలుగుదేశం పార్టీకి చెందిన కౌన్సిలర్ మాబు వలి ప్రశ్నించారు. దీనిపైన కమిషనర్ స్వచ్ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా ఏర్పాటు చేసిన స్వచ్ఛంద కార్పొరేషన్ సర్వీస్ ప్రొవైడర్లకు ఏపీ హౌసింగ్ బోర్డు వారి ప్రత్యేక ఆర్థిక తోడ్పాటు ద్వారా సర్వీస్ ప్రొవైడర్లకు బకాయి ఉన్న రూ.47.91 లక్షలు చెల్లించామని, అయితే ఆంధ్రప్రదేశ్ పుర పరిపాలన సంచాలకులు ఉత్తర్వుల మేరకు ఇప్పుడు మున్సిపల్ సాధారణ నిధులనుండి హౌసింగ్ బోర్డుకు చెల్లించాల్సి ఉంటుందని కమిషనర్ వివరణ ఇచ్చారు. వైస్ చైర్మన్ లేచి ఎన్ని ఆటోలు తిరుగుతున్నాయి. ఎన్ని రోజులు తిరిగాయి. ఇంటింటి చెత్త సేకరణ పన్ను ఎంత వసూలు అయ్యింది వాటి వివరాలు కౌన్సిల్ సమావేశం ముందు కమిషనర్ ఉంచకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే 50 అడుగులు వెడల్పు గల మాస్టర్ ప్లాన్ రోడ్డు సర్వే నంబర్ 753లోని 7 1/2 సెంట్లు ఖాళీ స్థలంకు టిడిఆర్ నాలుగు రేట్లు నష్టపరిహారం ఇవ్వొచ్చని అలాకా కుండా బాధితులకు స్థలంకు ప్రత్యామ్నాయ స్థలం ఇవ్వడానికి నిబంధనలు ఉన్నాయా గతంలో పద్మావతి నగర్ రోడ్డు వెడల్పుకు ఒక్కొక్కరు సెంటు, ముక్కలు సెంటు నష్టపోయారని వారందరికీ ప్రత్యామ్నాయ స్థలం ఇస్తారా అని కౌన్సిలర్ శ్యాం సుందర్ లాల్ ప్రశ్నించారు. కౌన్సిల్ పలు అంశాలకు ఆమోద ముద్రవేసింది. కౌన్సిల్ సభ్యులు అడిగిన ప్రశ్నలకు చైర్మన్ సమాధానం చెప్పారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు పక్కాగా సమాచారం ఉండాలని చైర్పర్సన్ షేక్ మాబున్నీసా కమిషనర్‌కు సూచించారు. కౌన్సిల్ సమావేశంలో పంషావలి, గంగిశెట్టి శ్రీధర్, కౌన్సిలర్లు కో ఆప్షన్ మెంబర్లు, మున్సిపల్ కమిషనర్ సి రవిచంద్ర రెడ్డి, రమణమూర్తి, మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ అంకి రెడ్డి, డిఈఈలు మధు కుమార్, శ్రీనివాస రెడ్డి, జయభరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గొంతుక ప్రజాశక్తి

- ప్రజాస్వామ్యానికి మార్గదర్శి - ప్రజాశక్తి ఎడిషన్ 20వ వార్షికోత్సవంలో వక్తలు



ప్రజాశక్తి వార్షికోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్



వేడుకల్లో మాట్లాడు తున్న టిడిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బిటి.నాయుడు

వేడుకల్లో మాట్లా డుతున్న డాక్టర్ శంకర్ శర్మ



ప్రజాశక్తి - కర్నూలు క్రైం

ప్రజల గొంతుక ప్రజాశక్తి అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ తెలిపారు. ప్రజాశక్తి కర్నూలు ఎడిషన్ 20వ వార్షికోత్సవ వేడుకలను గురువారం ఎడిషన్ కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యాలయానికి స్థలం ఇచ్చిన నగరూరు సుబ్రహ్మణ్యం దాతృత్వ కీర్తి ప్రజాశక్తితో పాటు చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. వారి కుటుంబం ప్రజాశక్తితోనే ఉండడం అభినందనీయమని తెలిపారు. విలువలతో, నిబద్ధతతో సిబ్బంది పని చేయడమే ప్రజాశక్తి విజయ రహస్యమని చెప్పారు. అనంతరం టిడిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బిటి.నాయుడు మాట్లాడారు. నేడు ప్రజాస్వామ్యం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. దేశంలో మనీ, మాఫియా, మీడియా రాజ్యమేలుతోందని తెలిపారు. ప్రజల కోసమే పని చేసే మీడియాగా ప్రజాశక్తి వ్యవహరిస్తోందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి మాట్లాడుతూ... ప్రతిక్షణం వార్తలను వండివార్చే మీడియా ఉన్న స్థితిలో పోటీని తట్టుకుని ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా ప్రజాశక్తి పని చేయడం అభినందనీయమని తెలిపారు. దీనికి సిబ్బంది అంకితభావమే కారణమన్నారు. ఉద్యమాలకు అండగా నిలిచే పత్రిక ప్రజాశక్తి అన్నారు. ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ... ప్రజాశక్తి అన్ని అంశాలను క్రోడీకరించి వార్తలను అందిస్తోందన్నారు. సామాన్యుల ఊపిరిగా ప్రజాశక్తి నిలుస్తోందన్నారు. ప్రజాశక్తిని చేర్పించడం, చదవడం, చదివించడం సామాజిక బాధ్యతే అన్నారు. రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య మాట్లాడుతూ... సోషల్ మీడియా ప్రభావం బలంగా ఉన్న నేటి పరిస్థితుల్లో పోటీని తట్టుకుని నిలబడడం ప్రజాశక్తికి ఉన్న ప్రత్యేకత అన్నారు. నేడు పార్టీల పరంగా పత్రికలు విడిపోయాయని, కానీ ప్రజల పక్షాన నిలబడి నికరమైన వార్తలను రాసేది ప్రజాశక్తి అని తెలిపారు. నగరూరు సుబ్రహ్మణ్యం ట్రస్టు చైర్మన్, కర్నూలు మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ నగరూరు శమంతకమణి మాట్లాడుతూ... ప్రజాశక్తితో తమ కుటుంబం ఎంతో అనుబంధాన్ని కలిగి ఉందన్నారు. ప్రజాశక్తి వైభవానికి కార్మికుల ఐక్యత, కుటుంబ వాతావరణమే కారణమన్నారు. ప్రజాశక్తికి తాము అండగా ఉంటామని అన్నారు. ప్రజాశక్తి జనరల్ మేనేజర్ హరికిషోర్ మాట్లాడుతూ... బ్రిటీష్ విధానాలకు వ్యతిరేకంగా పని చేసిన చరిత్ర కలిగిన పత్రిక ప్రజాశక్తి అన్నారు. మొదట్లో కొన్ని ఒడిదుడుకులతో అంతరాయం ఏర్పడినా 1981 నుంచి ప్రతి అక్షరం ప్రజల పక్షం నినాదంతో పని చేస్తోందన్నారు. 43 ఏళ్లుగా నిరాటంకంగా పని చేసిందన్నారు. ఉద్యోగుల పిఆర్‌సి ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలుస్తూ ప్రభుత్వంతో రాజీలేకుండా నిలబడిందన్నారు. అనంతరం ఎడిషన్ ఏర్పడినప్పటి నుంచి ఉన్న సిబ్బందిని, విలేకరులను సన్మానించారు. సన్మానం అందుకున్న వారిలో డెస్క్ ఇన్‌ఛార్జీ పానుగంటి చంద్రయ్య, ఎడివిటి జిల్లా ఇన్‌ఛార్జీ ఎం.రాజు, సిబ్బంది మల్లికార్జున, రంగయ్య, జయలక్ష్మి, భీసన్న, మద్దిలేటి, మునిస్వామి, జగదీష్ గౌడ్, విలేకరులు జోసఫ్ శేఖర్, మాదాల శ్రీనివాసులు, నాగయ్య, షుకూర్, యూసుఫ్ ఖాన్, ఇంతియాజ్ బాషా, సోమశేఖర్, కేశవులు, నాగరాజు, సర్క్యులేషన్ ఏజెంట్ ఈరన్న ఉన్నారు. మున్సిపల్ స్టాండింగ్ కమిటీ సభ్యులు నగరూరు శ్రీనివాసరావు, బిల్డర్ నగరూరు రాఘవేంద్ర, టిఎన్‌టియుసి రాష్ట్ర నాయకులు అశోక్, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ టి.నరసింహా, అనంతపురం ఎడిషన్ మేనేజర్ ఎన్.వేణుగోపాల్, ఎడిషన్ కమిటీ సభ్యులు మంగయ్య, ఎస్ఎడి.బాషా, ఎల్లా గువేరా, వినయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గౌస్‌దేశాయి



మాట్లాడుతున్న హరికిశోర్



మాట్లాడుతున్న శమంతకమణి



మాట్లాడుతున్న పుల్లయ్య



మాట్లాడుతున్న శ్రీనివాసరావు



మాట్లాడుతున్న రాఘవేంద్ర



టిడిపిని వీడి వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలోని టిడిపికి చెందిన ఎస్‌బిఐ కాలనీలోని ఉస్మాన్ బాషా, మదర్ సా, ఇలియాస్, మహబూబ్,జహంగీర్ వారితో పాటు 20 కుటుంబాలు టిడిపిని వీడి నేడు మాజీమంత్రి శిల్పా మోహన్ రెడ్డి సమక్షంలో వైసిపీలో చేరాయి. గురువారం నంద్యాల పట్టణంలోని శిల్పా నివాసంలో వారికి మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి కండువా కప్పి వైసిపిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలు నంద్యాలను అభివృద్ధి దిశగా తీసుకుపోతున్నందున వారికి ఆకర్షితులై తాము వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని ఉస్మాన్ బాషా ఆయన సన్నిహితులు తెలిపారు.

వైసిపి నుండి టిడిపిలో చేరిక




బుడ్డా రాజశేఖర్ రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరుతున్న కుటుంబాలు

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు మున్సిపాలిటీలో అధికార పార్టీ వైసిపికి భారీ షాక్ తగిలింది. పట్టణంలోని ఇందిరా నగర్ కాలనీకి చెందిన 50 దళిత కుటుంబాలు గురువారం శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరాయి. వీరికి మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి టిడిపి కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. టిడిపిలోకి అన్నలదాసు రాజు, బుడ్డ స్వామి, మురహరి చిన్న, ఎం.రవి, గోమగు అశోక్, ధర్మ, దుపం పెద్దన్న, మహేష్, కే.శ్రీను, సుంకన్నలతో పాటు 50 కుటుంబాలు చేరాయి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గంలో రాబోవు రోజుల్లో వైసిపి నుండి మరింత పెద్ద ఎత్తున టిడిపిలోకి చేరెందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆర్టీసి బస్సు చార్జీలు, చెత్త పన్ను, విద్యుత్ చార్జీలు, నిత్యవసర ధరలను ఏ ప్రభుత్వం పెంచని విధంగా వైసిపి ప్రభుత్వం పెంచిందన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం తథ్యమన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానాన్ని కల్పిస్తానని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సీనియర్ న్యాయవాది గోవిందరెడ్డి, గిరి రాజు, టిడిపి మైనార్టీ జిల్లా అధ్యక్షుడు కరీముల్లా, పట్టణ అధ్యక్షుడు జెట్టి వేణుగోపాల్, రవి ప్రసాద్, నాయకులు మురహరి నరసింహులు, జంగాల పెద్దన్న, శిరీష, శివ, మురహరి శ్రీనివాసులు, నందయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో గురజాడ వర్ధంతి వేడుకలు



ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి అరుణకుమారి ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ సాహితీ సేవాసంస్థ ఆధ్వర్యంలో గురజాడ వర్ధంతి వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆర్గనైజర్ కన్నయ్య మాట్లాడుతూ గురజాడ నవయుగ వైతాళికుడు, సామాజిక నాటకం కన్యాశుల్కం ద్వారా ప్రజలలో చైతన్యాన్ని కలిగించారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బాబాఫకృద్దీన్, దేవేంద్రనాథరెడ్డి, ప్రవీణ్ కుమార్, రామాంజనేయులు, పీరా తదితరులు పాల్గొన్నారు.

'నాడు-నేడు' బిల్లులు చెల్లించాలి : సిపిఎం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేటు స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు ప్రవేశపెట్టిన నాడు-నేడు కింద పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడంలో నిర్లక్ష్యం వహించడం తగదని, వెంటనే చెల్లించాలని సిపిఎం నాయకులు పి.ఫకీర్ సాహెబ్, టి.గోపాలకృష్ణ, సి.నాగన్నలు డిమాండ్ చేశారు. గురువారం నందికొట్కూరు పట్టణంలోని భరత్ కాంప్లెక్స్‌లో సిపిఎం నాయకులు, కాంట్రాక్టర్లు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ మండలంలోని మల్యాల, దామగట్ల, బొల్లవరం గ్రామాలలోని ఎంపిపి స్కూళ్లలో నాడు-నేడు కింద 2019-20లో ప్రహరీ గోడ, ఆర్చిలను కాంట్రాక్టర్లు శ్రీరాములు గౌడ్, కె.రంగ మునిలు దాదాపు 8 లక్షల అప్పులు చేసి నిర్మాణం చేపట్టారన్నారు. పనులు చేసి నాలుగేళ్లు అవుతున్నా ఎన్ఆర్ఈజీఎస్, ఎపిఈఐడిసి ఇంజనీర్ల నిర్లక్ష్యం కారణంగా బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ల పరిస్థితి ఆత్మహత్యలు చేసుకునే దాకా వచ్చిందన్నారు. ఈఈ, ఏఈలు కాంట్రాక్టర్లు చేసిన పనులకు వర్క్ ఐడిలు ప్రభుత్వానికి సమర్పించకపోవడం, సైట్ బంద్ కావడంతో ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. ఇదే అంశంపై రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లగా ఇంతవరకు సంబంధిత అధికారులు ప్రతిపాదనలు పంపలేదని చెప్పారన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాంట్రాక్టర్లు అప్పుల పాలు కావాల్సి వస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే బిల్లులు చెల్లించి కాంట్రాక్టర్లను ఆదుకోవాలని డిమాండ్ చేశారు, లేనిపక్షంలో కాంట్రాక్టర్ల కుటుంబంతో సహా నిరవధిక ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో కాంట్రాక్టర్లు ఈ శ్రీరాములు గౌడ్, కే రంగముని, ఎం కలిముల్లా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

జగనన్న ప్రభుత్వంలో నిరంతరం సంక్షేమ పథకాలు

- ఆత్మకూరు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ఆసియా



నందికొట్కూరు : మాట్లాడుతున్న రవి యాదవ్



పాములపాడు : సర్పంచి ఇంటి పై జెండాను కట్టిన నాయకులు



ప్యాపిలి: సంక్షేమ పథకం బోర్డు ను ఆవిష్కరిస్తున్న వైసీపీ నాయకులు

ప్రజాశక్తి - ఆత్మకూర్

రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు నిరంతరం కొనసాగుతున్నాయని ఆత్మకూరు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ ఆసియా అన్నారు. గురువారం పట్టణంలోని గరీబ్ నగర్ సచివాలయ 23, 24వ వార్డ్ పరిధిలో, ఆత్మకూరు మండలంలోని కృష్ణాపురం గ్రామంలో జడ్పిటిసి శంకర రెడ్డి ఆధ్వర్యంలో ఎపికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని చైర్మన్ అధికారులతో కలిసి ప్రారంభించారు.కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసరావు, వైసీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మీర్, కౌన్సిలర్ పార్వతి, రంగస్వామి, బోయ లక్ష్మమ్మ, ఎంపీడీవో మోహన్ కుమార్, కృష్ణాపురం సర్పంచి, ఎంపిటిసిలు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** నందికొట్కూరు మున్సిపాలిటీలోని 8వ సచివాలయం పరిధిలో 14, 16, 17వ వార్డుల్లో వై ఏపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని కౌన్సిలర్లు మానపాడు అశోక్, అబ్దుల్ రావూఫ్ అధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి , మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ రాహత్ జబ్బార్, మున్సిపల్ వైస్ చైర్మన్ అర్శపోగు ప్రశాంతి, మున్సిపల్ కమిషనర్ కిషోర్, పట్టణ జెసిఎస్ కన్వీనర్ అబూబకర్ పాల్గొన్నారు. అనంతరం సంక్షేమ పథకాల లబ్ధి వివరాల బోర్డును, వైసిపి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చిన్న రాజు, హమీద్, చాంద్ బాషా, లాలు, కో ఆప్షన్ సభ్యులు కేశవ రెడ్డి శ్రీనివాస రెడ్డి, అబ్దుల్ గఫార్, నాయకులు డి.రమేష్, మార్కెట్ రాజు, కురువ శీను, శాలి బాషా, సన అబ్దుల్లా, మధుసూధన్ రెడ్డి, పి.రమేష్, బద్రప్ప, ఆర్ట్ శీను, చింతా నాగేంద్ర ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు. **పాములపాడు :** ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని, రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని వైసిపి మండల అధ్యక్షులు జి.రామలింగేశ్వర రెడ్డి, సచివాలయ కన్వీనర్ల ఇన్చార్జి టి.నాగరాజు అన్నారు. మండలంలోని జూటూరు గ్రామంలో పల్లెకి వెళ్దాం, జగనే రాష్ట్రానికి ఎందుకు కావాలి అనే కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామానికి వచ్చిన ప్రభుత్వ పథకాల లబ్ధి వివరాల డిస్ప్లే బోర్డును సర్పంచ్ నాయిని సావిత్రమ్మ, వైసిపి మండల అధ్యక్షులు రామలింగేశ్వర రెడ్డిలు ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో వైసిపి జెండాలు ఆవిష్కరించారు. సర్పంచి ఇంటిపై జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో ఈవోఆర్డి శ్రీనివాసులు నాయుడు, వైస్ ఎంపీపీ కొండ వరలక్ష్మి, మద్దూర్ సింగిల్ విండో సొసైటీ చైర్మన్ గడ్డం కృష్ణారెడ్డి, మిట్టకందాల సర్పంచి చింతల నారాయణ, తుమ్మలూరు సర్పంచ్ వరప్రసాదరావు, సొసైటీ డైరెక్టర్ గోపాల్, వైసిపి మండల నాయకులు చౌడయ్య, మధుసూదన్ రావు, జబ్బార్, మద్దిలేటి, మహానంది రెడ్డి, ఉపేంద్ర, చరణ్, వెంకటేశ్వర్ రెడ్డి, దర్గయ్య, శ్రీనివాస్ ఆచారి, మాజీ సర్పంచ్ బాలునాయక్, హుస్సేన్, జనార్ధన్, ప్రభాకర్, కమలాకర్, శంకర్ గౌడ్, ఎల్లాగౌడ్, శేషు, సుంకన్న, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** నందికొట్కూరు మండలంలోని బిజినవేముల గ్రామ సచివాలయంలో సర్పంచి రవి యాదవ్ ఆధ్వర్యంలో వై ఎపి నీడ్స్ సిఎం జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన సంక్షేమ పథకాల లబ్ధి వివరాల బోర్డును స్థానిక నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం వైసిపి జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ పబ్బతి జ్యోతి, రవి, జెసిఎస్ కన్వీనర్ ఓంకార్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ రావత్ జబ్బార్, బైరెడ్డి శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఎన్ వెంకటరెడ్డి, శాతన కోట సర్పంచ్ జనార్ధన్ గౌడ్, జి.దానమయ్య, ఉపసర్పంచ్ సురేష్ యాదవ్, యేసురత్నం, ఎల్లనాయుడు, రాఘవ రెడ్డి, రవీంద్ర నాయుడు, ఎంపిటిసిలు సురేష్ యాదవ్, నాగేశ్వరావు, వార్డ్ మెంబెర్ సిరువాటి శీను, ఉప్పరి నాగరాజు, ఈడిగ వెంకటేశ్వర్లు, మొల్ల రఫీ, గొల్ల బాలశ్వరయ్య, ఉప సర్పంచి హుస్సేన్ భాష, గ్రామ పెద్దలు హుస్సేన్, సుధాకర్, బాబూలాల్, శివలింగం, పాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** మండలంలోని నారాయణపురం గ్రామంలో సర్పంచి ఎండూరు సరిత అధ్యక్షతన జరిగిన పల్లెకు పోదాం కార్యక్రమంలో ఎంపిపి దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వైసిపి కన్వీనర్ బారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జెసిఎస్ అధ్యక్షుడు ముడుమేల పుల్లారెడ్డి, మాజీ ఎంపీపీ దేశు వెంకట్రాంరెడ్డి, మాజీ జడ్పిటిసి చిన్న మద్దిలేటి, వైసిపి జిల్లా ఎస్సీ సెల్ సభ్యుడు సుబ్బారావు, అనంతయ్య, యువ నాయకులు విష్ణు పాల్గొన్నారు. **ప్యాపిలి :** ఎన్నడూ లేని విధంగా ఇంటివద్దకే ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుతున్నాయని జెడ్పిటిసి శ్రీరామరెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ బోరా మల్లికార్జునరెడ్డి అన్నారు. మండలంలోని పిఆర్ పల్లె గ్రామంలో మా నమ్మకం నువ్వే జగనన్న, ఎపికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం వైసీపీ మండల కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ మహేశ్వరీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సంక్షేమ పథకాల లబ్ధి వివరాల బోర్డును, వైసిపి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాగభూషణ్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ప్రేమ్‌సాగర్ రెడ్డి, నరసింహ రెడ్డి, రాజారెడ్డి, అల్లిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వెంకటేష్, రామాంజినేయులు, గృహ సారథులు పాల్గొన్నారు. **బేతంచర్ల :** బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. గురువారం నాడు మండలంలోని కొమ్మూరి కొట్టాల గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం సచివాలయం -2 లో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, మద్దిలేటి స్వామి చైర్మన్ సీతా రామచంద్రుడు హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ,మద్దిలేటి స్వామి మాజీ చైర్మన్ బీరువలి నాగేశ్వర రెడ్డి, రంగాపురం మాజీ సర్పంచ్ జగన్మోహన్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ రుద్రవరం నారాయణ, నాయకులు గూని నాగరాజు మండల కన్వీనర్ తిరుమలేశ్వర రెడ్డి, రంగాపురం సర్పంచ్, గుమ్మగాళ్ల రాజు, గోరుమాను కొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు, కొలుములపల్లి సర్పంచ్ ఎద్దులన్న, తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని వైసిపి రాష్ట్ర కార్యదర్శి గుండం శేషి రెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు సన్నల జనార్దన్ రెడ్డిలు పేర్కొన్నారు. మండలంలోని పలుకూరు సచివాలయం-2 పరిధిలో జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం వైసీపీ మండల అధ్యక్షులు పసుపల జనార్దన్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గుండం శేషిరెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం-2 పరిధిలో అభివృద్ధి పనుల ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్ కోనేటి సుమలత, ఉపసర్పంచ్ శివకృష్ణ, సచివాలయ కన్వీనర్ కతా వెంకట సుబ్బారెడ్డి, పుల్లారెడ్డి, ఎంఎల్‌ఓ మధుసూదన్, ఎంపిటీసీ సభ్యురాలు లక్ష్మీదేవి, వాలంటీర్ లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** అర్హులైన ప్రజల వద్దకే పథకాలు అందుతున్నాయని మండల వైఎస్ఆర్ పార్టీ కన్వీనర్ అంబటి గురివిరెడ్డి అన్నారు. మండలంలోని తుమ్మల పెంట గ్రామ సచివాలయా పరిధిలో వైసిపి జెండా ఎగరవేసి, లబ్ధిదారుల డిస్ప్లే బోర్డును ఆవిష్కరించి తోట మల్లేశ్వర్ రెడ్డి అధ్యక్షతన పల్లెకు పోదాం జగనన్న ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మండల వైఎస్ఆర్ పార్టీ కన్వీనర్ అంబటి గురివిరెడ్డి మాట్లాడారు. తుమ్మల పెంట గ్రామ సచివాలయానికి సంబంధించి రూ.19.65కోట్ల పై చిలుకు లబ్ధి చేకూరిందని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేశ్వరి, ఉప సర్పంచ్ తోట శివశంకర్ రెడ్డి, వైసీపీ నాయకులు బాలస్వామి రెడ్డి, వెంకట మల్లారెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు బూత్ కమిటీ కన్వీనర్‌లు, సచివాలయం కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు. **డోన్ :** డోన్ పట్టణంలోని 4వ సచివాలయం పరిధిలోని పాతపేట లోని 5,6 వార్డులలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి,వైస్ చైర్మన్ హరికిషన్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ కురుకుంద హరి,కౌన్సిలర్ కటికె వేణుగోపాల్,సచివాలయ కన్వినర్ హరీష్,మెడ రఘు, గృహసారథులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



బండి ఆత్మకూర్ : మాట్లాడుతున్న ఎంపిపి దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి



బనగానపల్లె: ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న నాయకులు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్



ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి.



కొలిమిగుండ్ల : జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు కన్వీనర్ అంబటి గురివిరెడ్డి

గంగరేగు వాగు చెరువు జల చౌర్యానికి అడ్డుకట్టేది..?

- పట్టించుకోని మైనర్ ఇరిగేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలి
- ఎపి రైతు సంఘం, వ్యకాసం

ప్రజాశక్తి - కొత్తపల్లి

కొత్తపల్లి మండలంలోని సింగరాజు పల్లి గ్రామ శివారులోని గంగ రేగు వాగు చెరువు నీటిని కొందరు అక్రమంగా జల చౌర్యానికి పాల్పడుతున్నా పట్టించుకోని మైనర్ ఇరిగేషన్ అధికారులపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు ఎస్.సంజీవ రాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.స్వాములు డిమాండ్ చేశారు. గురువారం డెడ్ స్టోరేజ్‌లో ఉన్న చెరువు నీటిని ఆయిల్ ఇంజన్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ చంద్రశేఖర్ నాయక్‌కు, ఎస్పై హుస్సేన్ భాష, ఇరిగేషన్ అధికారులకు గ్రామ ఆయకట్టు రైతులతో కలిసి వారు విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ చెరువు నిర్మాణం పూర్తయి 13 సంవత్సరాలైనా ఇరిగేషన్ అధికారులు తమ పరిధిలోకి తీసుకోకపోవడం వల్ల 450 ఎకరాల ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. చెరువు నుండి ప్రతి సంవత్సరం ఆయిల్ ఇంజన్ల ద్వారా దూర ప్రాంతాల మెట్ట భూములకు, శ్రీశైలం నీటిమనక భూములకు అక్రమంగా నీటిని తరలించుకుంటున్నారని తెలిపారు. ఈ సంవత్సరం సింగరాజుపల్లి గ్రామంలో రైతులు ఒక కమిటీగా ఏర్పడి అధికారుల దృష్టికి చెరువు సమస్యను తెలియజేయగా సెప్టెంబర్ నెలలో ఆయిల్ ఇంజన్లను వేయకుండా నివారించారని చెప్పారు. అయినా ఇరిగేషన్ అధికారులు అండదండలతో అక్రమార్కులు యదేచ్ఛగా చెరువులో డెడ్ స్టోరేజ్‌గా ఉన్న నీటిని తరలించుకుపోతున్నారని మండిపడ్డారు. ఈ విషయాన్ని తహశీల్దార్, ఇరిగేషన్ అధికారులకు, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని ఇరిగేషన్ అధికారులపై చర్యలు తీసుకొని గంగ రేగు వాగు చెరువును ఇరిగేషన్ డిపార్ట్మెంటులో చేర్చి అక్రమంగా ఇంజన్ల ద్వారా నీటిని తరలించకపోతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయ కట్టు రైతులు, రైతు కమిటీ సభ్యులు శ్రీనివా సులు, ఎన్.దాసు, సోమేశ్, రమణ, రాముడు, మురళి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

టిడిపితోనే అభివృద్ధి

- భూమా అఖిలప్రియ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

టిడిపితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. మండలంలోని ఆర్. కృష్ణాపురం గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రమంలో భాగంగా గురువారం రెండవ రోజు ప్రజావేదిక నిర్వహించి తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన పథకాలను వివరించి అనంతరం ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను మాజీ మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ హుస్సేన్ భాష, టిడిపి సీనియర్ నాయకులు రఘురామిరెడ్డి, గోపిరెడ్డి శివారెడ్డి, మర్రి పల్లె పాపిరెడ్డి తదితరులు ఉన్నారు. **వెంకటాపురం గ్రామంలో..** రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని తాలూకా టిడిపి యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి అన్నారు. సిరివెళ్ల మండలంలోని వెంకటాపురం గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రమంలో భాగంగా ప్రజావేదిక నిర్వహించి తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన పథకాలను వివరించి అనంతరం ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో జరిగిన అభివద్ధి శూన్యమన్నారు. రానున్న ఎన్నికల్లో ఆళ్లగడ్డలో టిడిపి జెండా ఎగరేస్తామన్నారు. **నందికొట్కూరు :** రానున్న ఎన్నికల్లో మళ్లీ వైసిపి వస్తే రాష్ట్రం అంధకారం అవుతుందని తెలుగుదేశం పార్టీ నంద్యాల పార్లమెంట్ ఇంచార్జి మాండ్ర శివానంద రెడ్డి అన్నారు. మండలంలోని శాతనకోట గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామ టిడిపి నాయకులు నారాయణ, స్వాములు, వెంకటరెడ్డి, చిన్న సుబ్బయ్య, అలీముద్దీన్, సలీం బాషా ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం మాండ్ర శివానంద రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ జయసూర్య, టీడీపీ నాయకులు గొల్ల కృష్ణ, మధు, మధు కుమార్, శేఖర్, రవి, సురేష్, ఓబుల్ రెడ్డి, సురేంద్రనాథ్ రెడ్డి, ప్రసాద రెడ్డి, రఘురామిరెడ్డి, రమేష్ రెడ్డి, మద్దిలేటి, ముర్తుజావాలి, రవి, చిన్న నాగలక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.





రాబోయే ఎన్నికల్లో పోటీకి సిద్ధం : ఎస్‌డిపిఐ

ప్రజాశక్తి - వెలుగోడు

ఏపిలో త్వరలో రాబోయే ఎన్నికల్లో ఎస్‌డిపిఐ పోటీ చేసేందుకు సిద్ధంగా ఉందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అతావుల్లా ఖాన్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా ఖాన్, ఉపాధ్యక్షులు అబ్దుల్లా బేగ్‌లు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని షాదీఖానాలో ఎస్‌డిపిఐ శ్రీశైలం నియోజకవర్గం కార్యకర్తలు, నాయకుల విస్తృత సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల, నెల్లూరు స్థానాల నుండి పార్లమెంట్ అభ్యర్థులు పోటీకి సిద్ధమని తెలిపారు. అలాగే అసెంబ్లీ స్థానాల్లో కూడా తమ పార్టీ అభ్యర్థుల జాబితాను త్వరలో ప్రకటిస్తామన్నారు. ఎన్నికల్లో పార్టీ పరంగా తీసుకోవాల్సిన విధి విధానాలను కార్యకర్తలకు సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలను ప్రజలు ఇప్పటికే వ్యతిరేకిస్తున్నారని, ప్రభుత్వాలు మాత్రం అంటీఅంటనట్టు వ్యవహరిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి సయ్యద్ ఫజులుల్లా, జిల్లా అధ్యక్షులు మహబూబ్ బాషా, ఉపాధ్యక్షులు లింకన్ రాజు, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కలాం, నియోజకవర్గం హుస్సేన్ భాష, ప్రధాన కార్యదర్శి మోహిన్, మండల కార్యవర్గ సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మహానందిలో వైభవంగా అన్నాభిషేకం

ప్రజాశక్తి - మహానంది

మహానంది పుణ్య క్షేత్రంలో గురువారం నాడు కార్తీక మాస ఆరుద్ర నక్షత్రం సందర్భంగా మహానందీశ్వర స్వామి వారికి వేదోక్తంగా అన్నాభిషేకం ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు మస్తాన్ రావు, దాతలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకే 'ఆడుదాం-ఆంధ్రా'

ప్రజాశక్తి - పగిడ్యాల

గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకే ఆడుదాం -ఆంధ్రా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎంపీడీవో వెంకటరమణ, ఎంఈఓ సుభాన్ తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, వాలంటరీకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాలలో ఎంతో ప్రతిభగల క్రీడాకారులు ఎంతోమంది ఉన్నారని, వారిలోని క్రీడా ప్రతిభను వెలికి తీయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆడుదాం-ఆంధ్ర పోటీలో పాల్గొనే క్రీడాకారుల పేర్లను ఏ విధంగా నమోదు చేయాలనే అంశంపై వారికి శిక్షణ ఇచ్చారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మురళి మోహన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ సుభాన్



'ఆడుదాం-ఆంధ్రా' రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలలో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైనట్లు ఎంపీడీవో మహబూబ్ ఖాన్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలం లోని అన్ని సచివాలయంలలో రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందన్నారు. గ్రామీణ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో డిసెంబర్ 15 నుండి ఫిబ్రవరి మూడో తేదీ వరకు క్రికెట్, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ వంటి క్రీడా పోటీలు జరుగుతాయి అన్నారు. 15 సంవత్సరాల నిండిన వారు తమ ఆధార్ తీసుకెళ్లి దగ్గర్లో ఉన్న సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు న్నారు. లేనిపక్షంలో 1902కు కాల్ చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడ పోటీలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.